PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 69 | విజయవాడ, గురువారం 9 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50


Vol No | Vijayawada, Thursday 9 October 2025 | Rs



విశాఖలోనూ అదే జోష్

- నేడు దక్షిణాఫ్రికాతో తలపడనున్న హర్మన్‌ప్రీత్ సేన
- పొంచివున్న వర్షం ముప్పు
- ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్

8





సుసుము కిటగవా | రిచర్డ్ రాబ్‌సన్ | ఒమర్ ఎం.యాగి

7

రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

- మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్‌ను అభివృద్ధిపరిచినందుకు అవార్డు

పోలీసు బారికేడ్లను తోసుకుంటూ ముందుకువెళ్తున్న ప్రజలు



అదాని సిమెంట్‌పై జనాగ్రహం

అభిప్రాయ సేకరణను అడ్డుకున్న ప్రజలు

టెంట్లు పీకేసి.. కుర్చీలు విసిరేసి నిరసన..15 మంది అరెస్ట్

తొలుత వెనుతిరిగి సాయంత్రం మరోసారి ప్రయత్నించిన అధికారులు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో, గాజువాక

విశాఖ జిల్లా పెదగంట్యాడ ప్రాంతంలో అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రయత్నాలపై ప్రజానీకం తిరగబడ్డారు. బుధవారం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణను తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ అడ్డుకున్నారు. వందలాది మంది పురుషులు, మహిళలు, పిల్లలు కలిసి కదం తొక్కారు. దీంతో పోలీసులకు, ప్రజలకు మధ్య తీవ్ర స్థాయిలో తోపులాటలు చోటుచేసుకున్నాయి. అడుగడుగునా పోలీసులను నెట్టివేస్తూ అభిప్రాయ సేకరణ స్థలం వద్దకు చేరుకున్న ప్రజానీకం అక్కడ చేసిన ఏర్పాట్లను చూసి భగ్గుమంది. టెంట్లను పీకివేసి, కుర్చీలను విసిరివేసి నిరసన ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఆగ్రహంతో ఉన్న స్థానికులను అడ్డుకోవడానికి అధికారులు, పోలీసులు చేసిన ప్రయత్నాలు ఏమాత్రం ఫలించలేదు. అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ పరిణామంతో వెనక్కితగ్గినట్టే తగ్గిన అధికారులు సాయంత్రం మరోసారి అభిప్రాయ సేకరణ నిర్వహించడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో 15 మందిని అరెస్ట్ చేశారు. పరిస్థితులు మరింత దిగజారే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికతో రెండు వారాల పాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు.

వివరాలు లోపలి పేజీల్లో

కుర్చీలను విసిరివేస్తున్న ప్రజలు



పిహెచ్‌సి వైద్యుల సమస్యలు పరిష్కరించండి

- సిఎంకు వి.శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పిహెచ్‌సిలో పనిచేస్తున్న రెగ్యులర్ డాక్టర్ల సమస్యలు పరిష్కరించి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి బుధవారం లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా పిహెచ్‌సిల్లో పనిచేస్తున్న 2,800 మంది డాక్టర్లు వారం రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్నారని, నాలుగు రోజులుగా విజయవాడలో దీక్షలు చేస్తున్నారని ఈ లేఖలో ఆయన సిఎం దృష్టికి తీసుకువచ్చారు. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలోల వైద్య ఆరోగ్య సేవలు అందించడంలో ఈ డాక్టర్లు ప్రముఖపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వీరి సమ్మెవల్ల పేదలకు వైద్యసేవలు దూరమవుతున్నాయని తెలిపారు. వారి ప్రతినిధులతో చర్చించి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. గతంలో ఇన్‌సర్వీసు డాక్టర్లకు పిజి సీట్లలో 30 శాతం సీట్లు కేటాయించేవారని, దాన్ని రాష్ట్ర ప్రభుత్వం 15 శాతానికి తగ్గించిందని పేర్కొన్నారు. దీనివల్ల ప్రభుత్వ రంగంలో సేవలందిస్తున్న డాక్టర్లు అదనపు విద్యార్హతలకు పొందడానికి, స్పెషలైజేషన్ కోర్సు చదవడం ద్వారా మరింత సేవలందించే అవకాశం తగ్గిపోయిందని పేర్కొన్నారు. దీనివల్ల గతంలో మాదిరే సీట్లు కేటాయించాలని వారు కోరుతున్నట్లు తెలిపారు. డాక్టర్లు ఎక్కువమంది ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రుల్లో సేవలందించడానికి మొగ్గు చూపుతున్నారని, ఈ మిగతా 7లో



ప్రమాదానికి గురైన బాణసంచా తయారీ కేంద్రం

కోనసీమలో ఘోరం!

బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు

- ఆరుగురు సజీవ దహనం • మరో నలుగురికి తీవ్ర గాయాలు
- డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో ఘటన
- ప్రమాదం పట్ల గవర్నర్ విచారం
- ముఖ్యమంత్రి చంద్రబాబు, వైసిపి అధినేత జగన్ దిగ్భ్రాంతి
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన హోం మంత్రి అనిత
- మృతుల కుటుంబాలకు రూ.50లక్షల పరిహారం ఇవ్వాలి: సిపిఎం

ప్రజాశక్తి- రామచంద్రపురం (కోనసీమ జిల్లా), అమరావతి బ్యూరో

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం కొమరిపాలెంలో బుధవారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ఈ ప్రమాదంలో ఆరుగురు సజీవ దహనమయ్యారు. వీరిలో నలుగురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. బాణసంచా పేలుడు ధాటికి తయారీ కేంద్రం గోడలు కుప్పకూలాయి. ఈ ప్రమాదం పట్ల రాష్ట్ర గవర్నర్ విచారం, ముఖ్యమంత్రి చంద్రబాబు, వైసిపి అధినేత జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంఘటనా స్థలాన్ని రాష్ట్ర హోం మంత్రి అనిత పరిశీలించారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... కొమరిపాలెం గ్రామంలోని శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ యూనిట్‌ను వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి (65) నిర్వహిస్తున్నారు. దీపావళి సమయం కావడంతో బాణసంచాను పెద్ద మొత్తంలో తయారు చేస్తున్నారు. స్థానికులు ఈ యూనిట్‌లో రోజువారీ కూలికి పని చేస్తున్నారు. బుధవారం ఎప్పటిలానే యజమానితోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన మరో తొమ్మిది మంది కూలీలు ఈ యూనిట్‌లో బాణసంచా తయారీలో నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం సమయంలో ఈ యూనిట్‌లో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. క్షణాల్లోనే దట్టమైన పొగ కమ్మి మంటలు చెలరేగాయి. భారీ పేలుడుకు ఈ యూనిట్ గోడ మిగతా 7లో

బీహార్ ఎన్నికలతో మోడీ ప్రభుత్వ పతనం ప్రారంభం

నితీష్ మత రాజకీయాలకు చరమగీతం పాడతాం

కేరళలో హ్యాట్రిక్ విజయం సాధిస్తాం

'దేశాభిమాని' ఇంటర్వ్యూలో సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

తిరువనంతపురం :'కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ పతనానికి బీహార్ ఎన్నికలే నాంది పలుకుతాయి. మతతత్వ శక్తులతో జట్టు కట్టిన నితీష్ కుమార్ ఓటమే లక్ష్యంగా అక్కడ పనిచేస్తున్నాం' అని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ అన్నారు. కేరళకు చెందిన దేశాభిమాని పత్రికకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బీహార్ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలను ఆయన ప్రస్తావించారు. త్వరలో కేరళలో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో హ్యాటిక్ర్ విజయం సాధించి, చరిత్ర సృష్టిస్తామని ఆయన చెప్పారు. ఇంటర్వ్యూ వివరాలు క్లుప్తంగా :



ప్ర: బీహార్‌లో ఇండియా బ్లాక్ విజయావకాశాలు ఎలా ఉన్నాయి?

జ : బీహార్‌లో ప్రజాతంత్ర, లౌకిక పార్టీలు కలిసి పోటీ చేస్తున్నాయి. ఇండియా బ్లాక్ ప్రభావం విస్తృతంగా ఉంది. దేశాన్ని మత ప్రాతిపదికన విభజించాలన్న ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల కుట్రలను తిప్పికొట్టడానికి రాష్ట్ర ప్రజానీకం సిద్ధంగా ఉంది. నితీష్ కుమార్ మత రాజకీయాలను ప్రజలు తిరస్కరిస్తున్నారు. ఆయన మతతత్వ శక్తులతో కట్టిన పొత్తును ప్రజానీకం విమర్శిస్తోంది. నేను బీహార్‌లో పలుమార్లు పర్యటించాను. ఆ పర్యటనల్లో ఈ విషయం స్పష్టంగా అర్థమైంది. నితీష్ కుమార్ విధానాలతో 20 ఏళ్లు నష్టపోయామని అక్కడి ప్రజలు చెబుతున్నారు. నితీష్ విద్వేష రాజకీయాలతో ప్రజలు విసిగిపోయారని నాకు అర్థమైంది. ప్రజాతంత్ర, లౌకిక, ప్రగతిశీల శక్తులు అధికారంలోకి రావాలని బీహార్ ప్రజలు కోరుకుంటున్నారు.

ప్ర: ఎన్నికల్లో జరిగే అవకతవకలను నివారించడానికి 'సర్' అత్యుత్తమ ప్రయత్నమని ఎన్నికల కమిషన్ చెబుతోంది. దీనిపై ఏమంటారు?

జ: ఎన్నికల కమిషన్ ప్రకటన, సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. వీటి మధ్య స్పష్టమైన వైరుధ్యం ఉంది. ఎన్నికల్లో 12వ గుర్తింపు కార్డుగా ఆధార్ కార్డును అనుమతించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన దిశా నిర్దేశం చేసింది. దీనిని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పరిగణనలోకి తీసుకున్నారా? మోడీ ప్రభుత్వం గట్టిగా మద్దతు ఇస్తున్నందునే ఎన్నికల కమిషన్ సుప్రీంకోర్టుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నట్లు కన్పిస్తోంది. తాజాగా ఒక ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడు భారత ప్రధాన న్యాయమూర్తిపైనే దాడికి ప్రయత్నించాడు. భయభ్రాంతులకు గురి చేసే వాతావరణాన్ని సృష్టిస్తున్నారనడానికి ఇదో నిదర్శనం. మోడీ ప్రభుత్వ మద్దతుతోనే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పదవిలో కొనసాగుతున్నారు. ప్రధాని, ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేయాలని సుప్రీంకోర్టు గతంలో సిఫార్సు చేసింది. కానీ దీనిని కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. ప్రస్తుత కమిషనర్లను మోడీయే ఎంపిక చేశారు. బీహార్‌లో ఎన్నికల ప్రకటనకు ముందు స్థానిక మహిళలకు రూ.10,000 ఇస్తామని ప్రధాని మోడీ, నితీష్‌కుమార్ ప్రకటన చేశారు. ఇది లంచం ఇవ్వడం వంటి దే. అయినా దీనిపై ఎన్నికల మిగతా 7లో

ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో 2 రోజులు భారీ వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని, ఈ నేపథ్యంలో రానున్న రెండు రోజులు ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు చెట్ల కింద నిలబడరాదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం నాడు అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు.

దక్కిలిలో 77.2 మిల్లీమీటర్ల వర్షపాతం

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం పలు ప్రాంతాల్లో వర్షపాతాలు నమోదయ్యాయి. తిరుపతి జిల్లా దక్కిలిలో 77.2 మిల్లీమీటర్లు, అల్లూరి జిల్లా అరకులో 61, నెల్లూరు జిల్లా దగదర్తిలో 57.7, బాపట్ల జిల్లా రామకూరులో 56.5, అనకాపల్లి జిల్లా పాములవాకలో 48.5, కడప జిల్లా పులివెందులలో 45.5 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతాలు నమోదయ్యాయి.

1.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

- విశాఖలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్
- ఎస్ఐపిబి సమావేశంలో నిర్ణయం
- 67 వేల మందికి ఉద్యోగావకాశాలు:చంద్రబాబు



ఎస్ఐపిబి సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో మరో 1,14,824 కోట్ల రూపాయల పెట్టుబడులకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం (ఎస్ఐపిబి)లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు ఎస్ఐపిబి సమావేశాలు పది జరగ్గా ఇది 11వ సమావేశం. తాజాగా ఆమోదించిన పెట్టుబడులతో రాష్ట్రంలో 67,218 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ఇప్పటి వరకు మొత్తం 7.07 లక్షల కోట్ల పెట్టుబడులు ఆమోదించినట్లు, వీటి ద్వారా 6.20 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందని ఆయన అన్నారు. తాజాగా ఆమోదించిన పెట్టుబడుల్లో విశాఖలో 87,520 కోట్ల రూపాయలతో చేపట్టే రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ కూడా ఉంది. దీని ద్వారా 200 మందికి ఉద్యోగాలు లభించనున్నట్లు సమావేశంలో పాల్గొన్న అధికారులు తెలిపారు. దేశంలోనే అతి పెద్ద విదేశీ పెట్టుబడిగా ఉన్న రైడెన్ ప్రాజెక్టు రాష్ట్రానికి వస్తోందని వారు చెప్పారు. రాష్ట్ర మంత్రి లోకేష్ దీనిని సాధించారంటూ ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు మంత్రులు అభినందనలు తెలిపారు. అలాగే అనంతపురంలో యాక్మే ఊర్జా ఒన్ లిమిటెడ్ సౌర విద్యుత్ కేంద్రాన్ని, టాటా పవర్ ఎనర్జీ సంస్థలు చెరో 2 వేల కోట్లతో పెట్టుబడులు పెట్టనున్నాయి. విజయనగరంలో చింతా గ్రీన్ ఎనర్జీ 12,905 కోట్లతో, కర్నూలు జిల్లాలోని ఓర్లకల్లులో రిలయన్స్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్ 758 కోట్లతో, అనకాపల్లిలో 2,600 కోట్లతో శాన్వీరా ఇండస్ట్రీస్ అధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ కార్బన్ కాంప్లెక్స్, పల్నాడులో 2,260 కోట్లతో శ్రీ సిమెంట్ కర్మాగారం విస్తరణ, అనంతపురంలో 510 కోట్లతో ఏరోస్పేస్, ప్రకాశం జిల్లాలోని దొనకొండలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ద్వారా 1200 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఆమోదం తెలిపారు.

ప్రాంతాల వారీగా కారిడార్లు

రాష్ట్రానికి వచ్చే ప్రాజెక్టులను ప్రాంతాల వారీగా ప్రోత్సహిస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. విశాఖ పారిశ్రామిక కారిడార్ తరహాలోనే రాయలసీమకూ ఒక ప్రత్యేక కారిడార్ ఉండాలని లోకేష్ అన్నారు. . దీనిపై చంద్రబాబు స్పందిస్తూ మూడు ప్రాంతాల్లో మూడు కారిడార్‌లు ఏర్పాటుచేయాలని సూచించారు. తూర్పు గోదావరి నుంచి శ్రీకాకుళం వరకు విశాఖ ఎకనామిక్ రీజియన్ ఏర్పాటుచేస్తున్నామని, అదే తరహాలో అమరావతి కేంద్రంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లా వరకు మరో మిగతా 7లో

'అనంత'పై కార్పొరేట్ పడగ

- సౌర విద్యుదుత్పత్తి కంపెనీలకు 65 వేల ఎకరాలు
- పరిశ్రమల పేరిట మరో 20 వేలు ఎకరాలు
- సాగు భూములు కోల్పోయి రైతన్నల వలస బాట



వృథాగా ఉన్న లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాపై సోలార్ కార్పొరేట్ కంపెనీల కన్ను పడింది. సముద్రమట్టానికి ఎగువ భాగంలో ఉన్న ఈ ప్రాంతంలో గాలి ఎక్కువగా ఉండడంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులు, ఎండవేడిమి సోలార్ పరిశ్రమలకు కాసుల పంట పండిస్తోంది. ఈ నేపథ్యంలో కార్పొరేట్ కంపెనీలు సాగు భూములను రైతులను నుంచి లాగేసుకుంటూ ఉమ్మడి అనంతపురం జిల్లాను చుట్టేస్తున్నాయి. సోలార్ కంపెనీలు, పరిశ్రమల వల్ల ఇక్కడ వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నట్టు ప్రభుత్వాలు గొప్పగా ప్రకటనలు చేస్తున్నాయి. అయితే, వాటివల్ల స్థానికులకు చేకూరుతున్న ప్రయోజనం పెద్దగా లేదు. ఉన్న భూములు పోయి... వ్యవసాయానికి సాగు భూమిలేక... రైతులు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లాల్సిన దీనస్థితి నెలకొంటోంది.

ఒక్క మెగావాట్ విద్యుదుత్పత్తి ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే నాలుగు నుంచి ఆరు ఎకరాల భూమి అవసరం. తక్కువలో తక్కువ నాలుగు ఎకరాలు అనుకున్నా 13,550 మెగావాట్ల విద్యుదుత్పత్తికి 2019 నుంచి ఆయా కంపెనీలకు ఇప్పటి వరకు ప్రభుత్వాలు అనుమతులిచ్చింది. ఈ లెక్కన ఉమ్మడి అనంతపురం జిల్లాలో 54,201 ఎకరాల భూమి ని సోలార్ కోసం కట్టబెట్టనున్నారు. గతంలోనే సేకరించి ఏర్పాటు చేసినవి చూస్తే... శ్రీసత్యసాయి జిల్లా ఎన్‌పికుంట మండలంలో సోలార్ పార్కు కోసం పది వేల ఎకరాలు సేకరించారు. ఇక్కడ విద్యుత్ సోలార్ ప్లాంట్ ఏర్పాటైంది. తాడిపత్రి మండలం తలారిచెరువు వద్ద వెయ్యి ఎకరాల్లో మరో సాలార్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఇవి కాకుండా అనేకచోట్ల సోలార్ పార్కులు ఏర్పాటు చేశారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనుమతి పొందిన సోలార్ పరిశ్రమలు

సోలార్ కంపెనీ	విద్యుదుత్పత్తి (మెగావాట్లలో)	అవసరమయ్యే భూమి (ఎకరాల్లో)
ఎపి ఎన్‌జిఇఎల్ హరిత్ అమృత్	4,000	16,000
జెఎస్‌డబ్లు నియో ఎనర్జీ	3,350	13,500
ఎన్‌పికుంట సోలార్ పార్కు	1,500	10,000
బొండాడ ఎనర్జీ లిమిటెడ్	2,000	8,000
ఎకోరాన్ ఎనర్జీ	1,000	4,000
రెన్యూ విక్రమ్	600	2,400
టాటా పవర్	400	1,600
దేశ్‌రాజ్ ఎనర్జీ	300	1,200
సెయిల్ సోలార్	300	1,200
ఎపి జెన్‌కో	100	400
మొత్తం	**15,150**	**65,310**

పరిశ్రమల కోసం తీసుకున్న భూముల్లో 12 వేల ఎకరాలు ఖాళీగానే

లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల విలువ రూ.20 వేల కోట్లపైనే!

సోలార్ పార్కుల ఏర్పాటు కోసం తీసుకున్న భూములు కాక పరిశ్రమల ఏర్పాటు పేరిట కూడా ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు మిగతా 7లో

5 వర్సిటీలకు విసిల నియామకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 5 విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను (విసిలు) నియమిస్తూ గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విసిగా సామంతపూడి వెంకట సత్యనారాయణరాజు, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విసిగా తాతా నరసింగరావు, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం విసిగా బి జయరామిరెడ్డి, జెఎన్‌టియు (విజయనగరం) విసిగా వెంకట సుబ్బారావును, యోగి వేమన విశ్వవిద్యాలయం (కడప) విసిగా బెల్లంకొండ రాజశేఖర్‌ను నియమిస్తూ విడివిడిగా నోటిఫికేషన్లు జారీ చేశారు.

సిఎస్ఆర్ నిధులతో హాస్టళ్లలో వసతులు మెరుగుపరచండి

- ఎస్‌సి కమిషన్ చైర్మన్ జవహర్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఎస్‌సి, ఎస్‌టి హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కె.ఎస్ జవహర్ ఆదేశించారు. బుధవారం నెల్లూరులో స్థానిక అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలోని సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ప్రభుత్వం మీదే ఆధారపడకుండా, జిల్లాలో పరిశ్రమలు విస్తృతంగా ఉన్న దృష్ట్యా సిఎస్ఆర్ నిధుల ద్వారా ఆయా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్థానిక నాయకుల వినతులను పరిశీలించి ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టి, ఎటువంటి లోటు రానీయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చదువుతోపాటు ఆరోగ్యం, దేహదారుఢ్యం, పారిశుధ్యం, పర్యావరణం వంటి వాటిపై ప్రత్యేకంగా విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి శోభారాణి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో కల్తీ లిక్కర్

- వైసిపి నాయకులు కాకుమాను రాజశేఖర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే కల్తీ లిక్కర్ దందా నడుస్తోందని, సిఎం చంద్రబాబు, లోకేష్ సూత్రధారులని వైసిపి ప్రచార విభాగం అధ్యక్షులు కాకుమాను రాజశేఖర్ ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కల్తీ లిక్కర్ వ్యాపారం కుటీర పరిశ్రమగా తయారైందని తెలిపారు. 70 వేల బెల్టుషాపులు ద్వారా రాష్ట్రమంతా సరఫరా చేస్తున్నారన్నారు. ఏరియాకో మంత్రిని నియమించి కల్తీ లిక్కర్ తయారు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ లిక్కర్ ఆదాయానికి గండికొట్టి భారీ దోపిడీకి తెరదీశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపు చర్యలకు దిగిన వారినెవరినీ వదిలిపెట్టబోమని, వైసిపి అధికారంలోకి రాగానే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రహదారుల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రోడ్లు, భవనాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 771.95 కిలోమీటర్ల స్టేట్ హైవేల అభివృద్ధి కోసం 108 పనులు చేపట్టేందుకు రూ.400 కోట్లు, 1,332.14 కిలోమీటర్ల మేజర్ డిస్ట్రిక్ రహదారుల అభివృద్ధి పనుల కోసం 133 పనులకు రూ.600 కోట్లు కేటాయిస్తూ పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన టిడిపి ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను టిడిపి ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా టీచర్ల అంతర్ జిల్లా బదిలీలను (మ్యూచువల్ స్వాప్) విజయవంతంగా నిర్వహించడంతోపాటు దీర్ఘకాలంగా ఉద్యోగోన్నతుల కోసం ఎదురుచూస్తున్న బాషా పండితుల సమస్యను పరిష్కరించినందుకు మంత్రి లోకేష్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను చర్చించుకుని పరిష్కరించుకుందామన్నారు.

బలవంతపు భూసేకరణ చేస్తే ప్రతిఘటన

- కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదన విరమించుకోవాలి
- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి - మందస

కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రతిపాదన రద్దు చేయాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘం నాయకులు మహదేవ్ డిమాండ్ చేశారు. ఉద్దాన ప్రాంతంలో బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తూ పోలీసుల ఆంక్షల నడుమ మండలంలోని ఎం.గంగువాడలో బుధవారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీకాకుళం జిల్లాకు ఘనమైన పోరాట చరిత్ర ఉందని గుర్తుచేశారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో బలవంతపు భూసేకరణ చేస్తే ప్రజల నుంచి అంతే స్థాయిలో ప్రతిఘటన ఉంటుందన్నారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో వందలాది ఎకరాల భూములు తీసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, ఇది తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అండగా న్యాయ పోరాటం చేస్తామన్నారు. రైతు ఆమోదం లేకుండా ఒక్క సెంటు భూమినీ తీసుకునే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టు వస్తే ఐదు లక్షల ఉద్యోగాలు వస్తాయని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్ని ఉద్యోగాలు వస్తాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వెంకటరమణ, తాండ్ర ప్రకాష్, లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు మాట్లాడుతూ... ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి చేసి పలాస ప్రాంతానికి తాగునీరివ్వలేని వారు అభివృద్ధి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని తెలిపారు. కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు అధ్యక్షతన నిర్వహించిన సభలో పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

నాలా స్థానంలో లెవీ

- భూమి విలువలో నాలుగు శాతం వసూలు
- డెవలప్‌మెంట్, ఇతర ఛార్జీలు అదనం
- ఆర్డినెన్స్ విడుదల చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నాలా చట్టాన్ని రద్దు చేసిన ప్రభుత్వం దానిస్థానంలో లెవీని తీసుకొచ్చింది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ బుధవారం ఆర్డినెన్స్ జారీచేశారు. ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రణాళికా చట్టం 1920లోని సెక్షన్ 44(1), సెక్షన్ 18(ఏ) ప్రకారం లెవీ వసూలు చట్టాన్ని తీసుకొస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. గతంలో నాలా కింద అనుమతులు పొందిన భూములను ఈ చట్టం కింద మినహాయించారు. ఈ చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ లెవీ వసూలు, ఇతర అభివృద్ధి ఛార్జీల వసూలు చట్టం 2025గా పేర్కొన్నారు. రాజధాని నగరం మినహా ఎపిసిఆర్‌డిఏ, పట్టణాభివృద్ధి సంస్థలు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, 1920 పట్టణ ప్రణాళికా చట్టం కింద నోటిఫై చేసిన అన్ని ప్రాంతాలకూ ఇది వరిస్తుందని తెలిపారు. వైస్‌ఛైర్‌పర్సన్లు, కమిషనర్లు దీనికి బాధ్యత వహిస్తారని తెలిపారు. వసూలు చేస్తున్న లెవీని రోడ్లు, ఫ్లైఓవర్లు, ఉద్యానవనాలు, ఇతర సౌకర్యాల కోసం ఉపయోగిస్తామని జిఓలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో నిర్ణీత ఛార్జీలు చెల్లించి అనుమతి పొందొచ్చని వివరించారు. సబ్ డివిజన్ జరగని భూముల్లో అభివృద్ధికి అనుమతులు కోరితే రెవెన్యూ నుండి ఎన్‌ఓసి తీసుకోవాలని చట్టంలో పేర్కొన్నారు. నాలా కింద దరఖాస్తు చేసుకున్న వాటిని ఈ చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిపాటు పరిష్కరిస్తారని వివరించారు. కొత్త చట్టం ప్రకారం ఎస్ఆర్‌ఓ విలువపై నాలుగుశాతం ఛార్జీలు వసూలు చేస్తారు. అది కూడా లేఅవుట్, అభివృద్ధి ఛార్జీలు అదనంగా ఉంటాయని వివరించారు. ఈ నెల మూడోతేదీ నుండి వసూలు చేసిన మొత్తాన్ని రెవెన్యూశాఖ 85:15 నిష్పత్తిలో సంబంధిత పట్టణాభివృద్ధి సంస్థలకు బదిలీ చేస్తుందని తెలిపారు. అలాగే వసూలు చేసిన లెవీకి ప్రత్యేక ఖాతా ఏర్పాటు చేయాలని తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులతో యాజమాన్యం చర్చలు విఫలం

- సమ్మె దిశగా అడుగులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీతో యాజమాన్యం బుధవారం విజయవాడ ట్రాన్స్‌కో ఎస్ఎల్‌డిసి భవనంలో నిర్వహించిన చర్చలు విఫలమయ్యాయి. తమ న్యాయమైన 29 డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే ఈ నెల 15 నుంచి సమ్మెలోకి వెళ్తామని నోటీస్ ఇచ్చిన నేపథ్యంలో జెఎసి సభ్యులను యాజమాన్యం చర్చలకు పిలిచింది. సమస్యలపై చర్చ జరిగినప్పటికీ యాజమాన్యం ఒక్క సమస్యపై కూడా పరిష్కారం దిశగా అడుగులు వేయలేదని జెఎసి నేతలు వెల్లడించారు. చర్చలు విఫలమైన నేపథ్యంలో అనివార్యంగా సమ్మెలోకి వెళ్లక తప్పని పరిస్థితి నెలకొందన్నారు. ఈ చర్చల్లో విద్యుత్ ఉద్యోగుల స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ నాగలక్ష్మి, సభ్యులు పృధ్వీతేజ్, సంతోష్‌రావు, డైరెక్టర్లు పాల్గొనగా, జెఎసి తరపున ఛైర్మన్ ఎస్ కృష్ణయ్య, కన్వీనరు రాఘవరెడ్డి, కో-ఛైర్మన్ కెవి శేషారెడ్డి, 1104 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలరావు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పి శివయ్య, ఒసి అసోసియేషన్ నాయకుడు కె శ్రీనివాస్, 1535 సంఘం నాయకులు అన్నే శ్రీనివాసకుమార్, బి నాగేశ్వర నాయక్, అంజయ్య, జికె వీరభద్రయ్య పాల్గొన్నారు.

జగన్ పర్యటనకు షరతులతో అనుమతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)



మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 9న రోడ్డు మార్గాన అనకాపల్లి జిల్లా మాకవరపాలెం వద్దనున్న మెడికల్ కాలేజీ నిర్మాణాలను పరిశీలించేందుకు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేస్తున్నట్టు విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ విమానాశ్రయం నుంచి ఎన్ఎడి, పెందుర్తి, సరిపల్లి, అనకాపల్లి, తాళ్లపాలెం మీదుగా మాకవరపాలెం చేరుకోవాలని సూచించారు. రూట్ మళ్లింపునకు, జన సమీకరణ, సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతి లేదని తెలిపారు. జగన్ వాహన శ్రేణికి సంబంధించి పది వాహనాలకు అనుమతి ఇస్తున్నామని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించడంలో విఫలమైతే వెంటనే అనుమతి రద్దు చేస్తామని, సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఏదైనా గాయం, ప్రాణనష్టం లేదా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తికి జరిగే నష్టానికి నిర్వాహకుడే వ్యక్తిగతంగా, పరోక్షంగా బాధ్యత వహించాలని విశాఖ సిపి ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

కల్తీ మద్యాన్ని ఉపేక్షించొద్దు

- సమీక్షలో సిఎం చంద్రబాబు




ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కల్తీ మద్యం తయారీ, అమ్మకాలను ఏమాత్రం ఉపేక్షించొద్దని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలను హరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయంలో ఈ అంశంపై అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గడిచిన 15 నెలల్లో పటిష్ట చర్యలతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికట్టామని, అంతే సమర్థవంతంగా పనిచేసి కల్తీ మద్యం లేకుండా చేయాలన్నారు. ఏ ఒక్క చోటా కల్తీ మద్యం తయారీ కేంద్రాలు కానీ, అటువంటి వ్యక్తులు కానీ ఉండకూడదని ఆదేశించారు. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అన్నమయ్య జిల్లాలో కల్తీ మద్యం వ్యవహారంలో తీసుకున్న చర్యలను, దర్యాప్తు వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈ వ్యవహారంలో మొత్తం 21 మంది నిందితులను గుర్తించామని, ఇప్పటికే 12 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. మిగిలిన వారిని త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. జనార్ధనరావుకు చెందిన వ్యాపారాలపై తనిఖీలు చేయగా, కిరాణా షాపు వెనుక కల్తీ మద్యం నిల్వలను గుర్తించినట్లు తెలిపారు. జనార్ధనరావు ఇబ్రహీంపట్నంలోని మెస్సర్స్ ఎఎన్ఆర్ బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 15 ఏళ్లుగా మద్యం వ్యాపారం చేస్తున్నాడని, అధిక లాభాల కోసం నకిలీ మద్యం తయారీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అతని సోదరుడు జగన్మోహనరావు కల్తీ మద్యం తయారీ, సరఫరా, అమ్మకం చేపట్టాడని ముఖ్యమంత్రికి వివరించారు. కల్తీ మద్యం వ్యవహారంలో అధికారులకు సిఎం పలు కీలక సూచనలు చేశారు. ఈ వ్యవహారంపై రాజకీయ పార్టీలు తప్పుడు ప్రచారంతో ప్రయోజనం కోసం ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. ప్రజలను భయపెడుతున్నారని, ప్రతి మూడు బాటిల్స్‌లో ఒక బాటిల్ కల్తీ మద్యం ఉందని తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. కల్తీ మద్యం కారణంగా కొందరు మృతి చెందినట్లు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఆరోపణపైనా విచారణ జరపాలని ఆదేశించారు. సైంటిఫిక్‌గా నిర్ధారించి, వాస్తవాలు వెల్లడించాలని సూచించారు. ఏది నిజమో చెప్పడంతోపాటు తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియా అయినా తప్పుడు ప్రచారం చేస్తే ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎక్సైజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, డిజిపి హరీష్ కుమార్ గుప్తా పాల్గొనగా, హోంమంత్రి వి అనిత వర్చువల్‌గా పాల్గొన్నారు.

కందిపప్పు వ్యాపారులపై ఐటి దాడులు

రాష్ట్ర వ్యాప్తంగా నివాసాలు, మిల్లులల్లో తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వ్యాపారులపై ఆదాయపన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. గత రెండు రోజులుగా ఈ దాడులు కొనసాగుతున్నాయి. కర్నూలు, తెనాలి, గుంటూరు, విజయవాడ, వినుకొండ, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో ఆదాయపన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. మంగళ, బుధవారాల్లో గుంటూరులోని బ్రాడీపేట, ఏటూకూరు రోడ్డులో కంది పప్పు మిల్లు వ్యాపారి ఎస్.వెంకటేశ్వరరావు నివాసం, మిల్లులో ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. రూ.400 కోట్ల మేరకు లెక్కలు తేడాలు ఉన్నట్టు గుర్తించారు. వెంకటేశ్వరరావు మరికొందరితో కలసి తెలంగాణ, ఎపిలో కందిపప్పు వ్యాపారులకు సిండికేట్‌గా వ్యవహరిస్తున్నారు. ఆదాయ పన్ను చెల్లింపునకు సంబంధించి భారీగా అక్రమాలు ఉన్నట్టు తెలంగాణ అధికారులు కనుగొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పౌరసరఫరాల శాఖ ద్వారా కందిపప్పు సరఫరా చేయకుండానే చేసినట్టు రికార్డులు చూపి నిధులు కాజేసినట్టు వచ్చిన ఫిర్యాదులపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వానికి కందిపప్పుతో పాటు పలు నిత్యావసర వస్తువులు, ఇతర శాఖలకు వివిధ రకాల వస్తువుల సరఫరాలో కీలక భూమిక పోషించిన హిందూస్థాన్ ట్రేడర్స్ నిర్వాహకులు మస్తాన్ రావు 2019 నుంచి 2024 వరకు పౌరసరఫరాల శాఖలోని కీలక అధికారులను మ్యానేజ్ చేసి అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించారు. పౌరసరఫరాల శాఖలో రిటైర్డు అధికారులను సంస్థలో నియమించుకుని వారు ఇచ్చిన సలహాలు, సూచనలతో అక్రమాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. అయినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలూ లేవు. హిందూస్థాన్ ట్రేడర్స్‌కు అనుబంధంగా మరో రెండు వ్యాపార సంస్థలు కొనసాగుతున్నాయి. వినుకొండలో పప్పుల మిల్లు వ్యాపారి ఓ.శ్రీనివాసరావు నివాసం, మిల్లుపై దాడి చేశారు. వీరికి సంబంధించిన కార్యాలయాలపై కూడా దాడులు నిర్వహించారు. హిందూస్థాన్ ట్రేడర్స్ నిర్వాహకులు మస్తాన్‌రావు ఇటీవల తిరుమల వెంకటేశ్వరస్వామికి రూ.3.5 కోట్లతో బంగారు ఆభరణాన్ని సమర్పించారు. ఈ అంశంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున దుమారం చెలరేగింది. ఒక వ్యాపారి ఇంత మొత్తంలో ఆలయంలో ఆభరణాలు ఇచ్చారంటే ఎంత సంపాదించారో అని వ్యాఖ్యానాలు రావడంతో ఐటి అధికారులు వ్యాపారిపై దృష్టి సారించారు. ఈమేరకు అతని ఆర్థిక లావాదేవీలపై ఆదాయపన్ను అధికారులు దర్యాప్తు చేయడంతో పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగుచూడటంతో రాష్ట్రంగా ఈసంస్థ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, నివాసాలపై దాడులు కొనసాగిస్తున్నారు.

రైతులకు మేలు చేయని ప్రభుత్వాలు

- ఎఐకెఎస్ సహాయ కార్యదర్శి సాగర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రం, రాష్ట్రంలో రైతుల మద్దతులో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు రైతాంగానికి మేలు చేసే ఒక్క విధానాన్నీ అవలంభించడం లేదని ఆల్ ఇండియా కిసాన్ సభ సహాయ కార్యదర్శి టి సాగర్ తెలిపారు. వడ్డేశ్వరంలో ఎపి రైతు సంఘం బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. అమెరికా, దేశ వ్యవసాయ ఉత్పత్తులపై విధించిన సుంకాలు లక్షలాది కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పత్తి, రొయ్యలపై విధించిన సుంకాల వల రైతాంగం, వారి కుటుంబాలు రోడ్లపాలు అయ్యే పరిస్థితి నెలకొందన్నారు. అమెరికా పోకడలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎక్కడా నోరు మెదపడం లేదన్నారు. టెక్స్‌టైల్, ఆక్వా రంగ ఉత్పత్తులు ఎక్కువగా ఎగుమతి అయ్యేది అమెరికాకే కాబట్టి ఈ సుంకాలతో 10 కోట్ల కుటుంబాలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. పాలపొడిపై దిగుమతి సుంకం 60 శాతం నుంచి 30 శాతానికి తగ్గించాలని అమెరికా కోరుతుందని, ఇది అంగీకరిస్తే గ్రామీణ రైతాంగం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సిసిఐ ఆధ్వర్యాన పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయకుండా రైతులను దగా చేస్తుందన్నారు. కార్పొరేట్ సంస్థలకు రూ.16.50 లక్ష కోట్లను మాఫీ చేసిన ప్రభుత్వం.. రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు పంటల బీమా అమలు చేయడంలో మొండిచేయి చూపారన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య మాట్లాడుతూ.. భవిష్యత్ కర్తవ్యాల్లో భాగంగా మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ రైతు సంఘం మహాసభలు నిర్వహించి ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు. కమిటీల్లో మహిళలు, యువతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. 2026 జనవరి 29 నుంచి 31వ తేదీ వరకూ మూడు రోజులు అఖిల భారత కిసాన్ సభ సమావేశాలకు అన్ని జిల్లా కమిటీలు సన్నద్ధం కావాలన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు విస్తృత ప్రచార కార్యక్రమాన్ని సమావేశాలల్లోపు నిర్వహించాలన్నారు. సంఘం ఉపాధ్యక్షులు ఎం సూర్యనారాయణ మాట్లాడుతూ.. రైతాంగ వాయిస్‌గా ఉన్న రైతు వాణి పత్రికను విస్తృతంగా రైతుల్లోకి తీసుకువెళ్లే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో అన్ని జిల్లాల నాయకులు, రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ప్రధాని పర్యటనపై సిఎం సమీక్ష

- శ్రీశైలంలో జ్యోతిర్లింగ, శక్తిపీఠ క్షేత్రాల దర్శన
- ఓర్వకల్లులో జిఎస్‌టి ఉత్సవ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనను విజయవంతం చేయాలని, ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రధాని శ్రీశైల పర్యటన నేపథ్యంలో బుధవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. దీనికి మంత్రులు లోకేష్, బిసి జనార్ధనరెడ్డి, అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేష్, సిఎస్ విజయానంద్, డిజిపి హరీష్ కుమార్ గుప్తా పాల్గొన్నారు. అమరావతి, విశాఖలో ప్రధాని పర్యటన సందర్భంగా చేసిన ఏర్పాట్లకు మించి కర్నూలు, నంద్యాలలో ఏర్పాటు చేయాలని సూచించారు. తొలుత శ్రీశైల ఆలయాన్ని దర్శించుకుంటారని, అనంతరం ఓర్వకల్లులో జరిగే బహిరంగ సభకు హాజరవుతారని పేర్కొన్నారు. కేంద్రం తెచ్చిన జిఎస్‌టి 2.0 సంస్కరణలకు అభినందనలు తెలుపుతూ దేశంలో తొలిసారిగా ఎపి అసెంబ్లీలో తీర్మానం చేశామని తెలిపారు. దసరా నుండి దీపావళి వరకూ పెద్దయెత్తున ఉత్సవ కార్యక్రమాలు చేపడుతున్నామని, ఈ నేపథ్యంలో ప్రధాని సభను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని వివరించారు. సభకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆహారం, తాగునీటి సదుపాయం కల్పించాలని, ట్రాఫిక్, పార్కింగు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.



విల్లంబులు చేతపట్టి ర్యాలీ చేస్తున్న గిరిజనులు

జిఒ13 రద్దు చేయండి

- హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ ర్యాలీ, సభ

ప్రజాశక్తి - పాచిపెంట (పార్వతీపురం మన్యం జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం గుమ్మకోట పంచాయతీ గుజెలి వద్ద 1500 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కోసం నవయుగ కంపెనీ ఏర్పాటు చేసే హైడ్రోపవర్ ప్రాజెక్టును వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు విల్లంబులు చేతపట్టి పాచిపెంట మండలం గుమ్మకోట జంక్షన్ నుంచి సతాబి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రాజెక్టు వల్ల పాచిపెంట మండలంలోని సతాబి, తంగలం, మూటకూడు, గరి సెగుడ్డి, గొట్టూరు పంచాయతీల పరిధిలోని గ్రామాలు ముంపునకు గురవుతాయని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో సతాబి వద్ద ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పి.పండు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర, రాష్ట్ర నాయకులు బాలదేవ్, సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి కె.గంగు నాయుడు మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న అపారమైన ఖనిజ సంపదను అదాని, అంబాని, నవయుగ వంటి కార్పొరేట్లకు దోచిపెట్టడమే పనిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విమర్శించారు. అందులో భాగంగానే అనంతగిరి, పాచిపెంట మండలాలను ముంపునకు గురిచేస్తూ గిరిజనులకు తీవ్ర ద్రోహం చేసేందుకు జిఒ 13ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. నవయుగ సంస్థకు ఈ ప్రాంత ప్రజలను బలి చేయాలని ప్రభుత్వాలు చూస్తున్నాయని, ఇలాంటి నిర్ణయాలపై జెండాలను పక్కనపెట్టి గిరిజనులంతా ఏకమై అడవుల్లో పడ్డ దొంగలను తరిమివేయడానికి సిద్ధపడాలని, ఎంతటి పోరాటానికైనా వెనుకడుగు వేయకుండా ముందుకు కదలాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల జీవితాలతో ఆడుకోవాలనుకుంటే ఆదివాసీ సంఘాలు చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సతాబి, తంగలం, మూటకూడు, గరిసిగుడ్డి, గొట్టూరు సర్పంచులు శిల్ప జన్ని రామయ్య, ఆపోయి అప్పన్న, ముఖీ మల్లేశ్వరరావు, ముఖీ ఆనంద్, సింహాచలం, ఎంపిటిసి సభ్యులు చదల రాజు, ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ సలహా మండలి ఏర్పాటు

- 21 మంది సభ్యులుగా నియామకం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో జరిగిన గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ సమ్మిట్లో తీసుకున్న నిర్ణయాల అమలు కోసం గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ అమరావతి సలహా మండలిని ఏర్పాటు చేశారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మండలి ఛైర్మన్‌గా నీతి అయోగ్ సభ్యులు వికె సారస్వత్ వ్యవహరించనున్నారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ కో-ఛైర్మన్‌గా ఉంటారు. నెడ్‌క్యాప్ ఎమ్‌డి ఎం కమలాకరబాబు మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. ఎస్ఆర్ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారాయణరావు సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. సభ్యులుగా ప్రభుత్వ కార్యదర్శి యువరాజ్, హైడ్రోజన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు ఆర్‌కె మల్హోత్రా, అశిష్ లేలే, ఆరిందన్ సాహా, సుజిత్ పిళ్లై ఉన్నారు. అలాగే అమిత్ శరత్, రంజిత్ కృష్ణపాయ్, సతీష్‌కుమార్, జెకె శ్రీవాస్తవ, రామకుమార్, సుప్రీతో గంగూలి, క్రిష్టోఫర్ హెబ్లింగ్, సచిన్‌చఫ్‌ను సభ్యులుగా నియమించారు. వీరితోపాటు డిఎంఆర్ పాండా, ధర్మాన త్రిభువన్, శైలేంద్ర మోమన్ బెబోత్రా, పి.సుబ్రహ్మణం ఉన్నారు.

15న వామపక్ష పార్టీల నిరసన : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 16న రాష్ట్ర పర్యటనకు వస్తున్న నేపథ్యంలో 10 వామపక్ష పార్టీల ఆధ్వర్యాన ఈ నెల 15న కర్నూలులో నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిఎస్‌టి అమలు చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి రూ.8 వేలకోట్ల మేర నష్టం వాటిల్లుతుందని సిఎం చంద్రబాబు ప్రకటించారని, అదే ముఖ్యమంత్రి జిఎస్‌టి విజయోత్సవ సభలో ప్రధాన మంత్రి మోడీతో కలిసి పాల్గొనడం హాస్యాస్పదమన్నారు. గత 11 ఏళ్ల పాలనలో ప్రధాని రాష్ట్రానికి చేసిన మేలు ఒక్కటీ లేదన్నారు. రాష్ట్రానికి విభజన హామీల అమలు చేయలేదని, ప్రత్యేక హోదా ఇవ్వలేదని, వెనుకబడిన రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీని అటకెక్కించారని విమర్శించారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం ప్రైవేటు సంస్థకు అప్పగించారని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించేందుకు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈ రాష్ట్రానికి ప్రధాని చేసిందేమీ లేకపోయినా, ఇక్కడకు వచ్చి విజయోత్సవ సభ జరుపుకోవడం సిగ్గుచేటన్నారు. 15న చేపట బోయే నిరసన కార్యక్రమంలో ప్రజలు పెద్దయెత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

పొరపాటు జరిగింది

- సర్వే రాళ్లు లేక తేల్చలేకపోతున్నాం
- రాజధానిలో వెనుదిరిగిన సర్వే అధికారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని పరిధిలో వరల్డ్ బ్యాంకుకు ఫిర్యాదు చేసిన రైతుల భూములను మండల సర్వే అధికారులు నిర్ధారించలేకపోయారు. తమ భూములు బలవంతంగా లాక్కుంటున్నారని మందడానికి చెందిన రైతులు వరల్డ్ బ్యాంకుకు ఫిర్యాదు చేశారు. దీనిపై భూమి సరిహద్దులు తేల్చి నిర్ధారించేందుకు మండల తహశీల్దార్ నేతృత్వంలో సర్వే అధికారులు బుధవారం భూమి వద్దకు వచ్చారు. గంటపాటు తర్జన భర్జన పడిన అనంతరం సర్వే రాళ్లు ఎక్కడ ఉన్నాయో తెలియడం లేదని, జిల్లా సర్వే అధికారులకు లేఖ రాసుకోవాలని రైతులకు సూచించారు. అయితే రైతుల భూమి ఉందని, గతంలో భూమిని గుర్తించడంలో జరిగిన పొరపాటువల్ల ఫెన్సింగ్ తొలగించారని చెప్పినట్లు తెలిసింది. అక్కడ హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మిస్తున్నారని, అందువల్లే చదును చేశామని తెలిపారు. దీనిపై రైతులు ఆగ్రహించారు. తాము పాతిన సరిహద్దులు తొలగించి ఇప్పుడు తేల్చలేకపోతున్నామంటే ఎలాగని తహశీల్దార్ తదితరులను ప్రశ్నించారు. జిల్లా సర్వే అధికారులు, లేదా రాష్ట్ర సర్వే అధికారులు ఆ భూమిని తేల్చాలని చెప్పి మండల సర్వే బృందం అక్కడ నుండి వెళ్లిపోయింది. దీనిపై రైతులు మాట్లాడుతూ సిఆర్‌డిఏలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఒకరు దూకుడుగా వ్యవహరిస్తున్నారని, గుంటూరు జిల్లా అధికారిగా చేసిన ఆయన రైతులపట్ల చులకనగా మాట్లాడుతున్నారని రైతులు తెలిపారు. కార్యాలయానికి వెళితే దొంగలను చూసినట్లు చూస్తున్నారని హేళనగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవసరమైతే ఆయనపై ప్రైవేటుకేసు దాఖలు చేస్తామని హెచ్చరించారు.

13, 14 తేదీల్లో దీక్షలను జయప్రదం చేయండి

- ఏపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని, నూతన కౌలు చట్టం తీసుకురావాలని కోరుతూ ఈ నెల 13, 14 తేదీల్లో తహశీల్దారు కార్యాలయాల వద్ద దీక్షలను చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ప్రభుత్వం అధికారం చేపట్టి 18 నెలలు గడిచినా ముసాయిదా చట్టాన్ని శాసనసభలో పెట్టి ఆమోదించలేదని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూస్వాములకు, భూ యజమానులకు కూటమి ప్రభుత్వం లొంగిపోయిందా? అని ప్రశ్నించారు. భూ యజమాని సంతకం తప్పనిసరి అనే నిబంధన చేర్చడం వల్ల ప్రస్తుతమున్న చట్టం వల్ల కౌలు రైతులకు ప్రయోజనం లేదన్నారు. పాత చట్టాన్ని రద్దు చేసి భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గ్రామ సభల్లో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, తద్వారా పంట రుణాలు, పెట్టుబడి సాయం, పంట నష్ట పరిహారం, ఇ-క్రాఫ్, పంటల బీమా, పంట అమ్ముకోవడం వంటి అన్ని సౌకర్యాలు పొందేటట్లు నూతన చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కారం చేయని పక్షంలో ఈ ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగానే కౌలు రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ నెల 13, 14 తేదీల్లో తహశీల్దారు కార్యాలయాల వద్ద నిర్వహించే దీక్షల్లో అధిక సంఖ్యలో కౌలు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పిడుగుపాటుతో రైతు మృతి

ప్రజాశక్తి-కణేకల్లు (అనంతపురం జిల్లా)

పిడుగుపాటుకు గురై రైతు మృతి చెందిన ఘటన అనంతపురం జిల్లా కణేకల్లు మండలం గరుడచేడు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. మృతునికుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గరుడచేడు గ్రామానికి చెందిన గోవిందు (55) మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. పొలం పని నిమిత్తం బుధవారం పొలానికి వెళ్లారు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో తడవకుండా ఉండేందుకు ఆయన చెట్టు కింద తలదాచుకున్నారు. ఆ సమయంలో పిడుగు పడడంతో రైతు గోవిందు అక్కడికక్కడే మరణించారు. పక్కనే ఉన్న ఓ ఎద్దు కూడా పిడుగుపాటుకు మృత్యువాత పడింది.

కాకినాడ, ఉప్పాడలో నేడు పవన్ పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ గురువారం నాడు కాకినాడ, ఉప్పాడలో పర్యటించనున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు బుధవారం తెలిపాయి. గురువారం ఉదయం 10 గంటలకు కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో మత్స్యకార ప్రతినిధులు, ప్రభుత్వం నియమించిన కమిటీతో సమావేశం కానున్నారు. ఉప్పాడ ప్రాంత మత్స్యకారుల సమస్యలపై చర్చించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆత్మహత్య

ప్రజాశక్తి - సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)


శ్రీకాంత్(ఫైల్)

ఆర్థిక సమస్యలతో ఫారెస్ట్‌బీట్ ఆఫీసర్ ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో నివసిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ (43) తన నివాసంలో గడ్డి మందు తాగి, విధుల నిమిత్తం గుడివాడ (మానాపురం పోలీస్‌స్టేషన్ పరిధి)కు వెళ్లారు. నీరసంగా ఉండడంతో కుటుంబసభ్యులకు ఫోన్ చేసి విషయం తెలిపారు. ప్రాథమిక చికిత్స నిమిత్తం గజపతినగరం ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం విజయనగరం మహారాజా హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. శ్రీకాంత్ స్వస్థలం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు. అప్పుల భారం, ఆర్థిక సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెఫ్రోప్లస్ 500 డయాలిసిస్ క్లినిక్‌లకు విస్తరణ

హైదరాబాద్ : ఆసియాలోనే అతి పెద్ద డయాలిసిస్ సర్వీసుల సంస్థ నెఫ్రోప్లస్ కొత్తగా అమృత్ హాస్పిటల్ భాగస్వామ్యంతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని సహారన్‌పూర్‌లో నూతన డయాలిసిస్ సెంటర్‌ను ప్రారంభించడం ద్వారా అంతర్జాతీయంగా 500 సెంటర్ల చారిత్రక మైలురాయికి చేరినట్లు తెలిపింది. "భారత్‌తో పాటు విదేశాల్లోనూ డయాలిసిస్ సంరక్షణను పునర్నిర్వచించే లక్ష్యంతో మేము మరిన్ని ప్రాంతాలకు, మరింత వేగంగా విస్తరిస్తున్నాం" అని నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ లిమిటెడ్ గ్రూప్ సిఇఒ రోహిత్ సింగ్ తెలిపారు. 2010లో హైదరాబాద్‌లో ఒక్క క్లినిక్ స్థాయి నుంచి నేడు 500 క్లినిక్స్ స్థాయికి నెఫ్రోప్లస్ ఎదగడమనేది తమ విజయాలకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు.

వైద్య కళాశాలలు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి

- జెవివి రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు

వైద్య కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, పిపిపి విధానంలో ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని జన విజ్ఞాన వేదిక (జెవివి) రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. గుంటూరు బ్రాడీపేటలోని యుటిఎఫ్ సమావేశ మందిరంలో మంగళవారం రాత్రి జరిగిన ఈ సమావేశంలో జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడారు. ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుబంధంగా ఏర్పాటు చేసే 300 పడకల ఆస్పత్రితోనే పేద రోగులకు ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలు అందుతాయన్నారు. కేంద్రం 60 శాతం ఇస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భారం పేరుతో పది వైద్య కళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం సరికాదన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని పెడచెవిన పెట్టిన నేపథ్యంలో విద్యార్థి, యువజన, ప్రజాసంఘాలతో ఐక్య కార్యచరణ రూపొందించి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాన్ని ఎండగడతామని హెచ్చరించారు. జనచైతన్య వేదిక అధ్యక్షులు వి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ముందుకెళ్తే ప్రభుత్వాలు మనుగడ సాధించలేవని హితవు పలికారు. వైద్యం ప్రభుత్వ రంగంలో ఉంటే పేద, మధ్యతరగతి ప్రజలకు జరిగే మేలు గురించి ఎయిమ్స్ ఆస్పత్రి ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. ప్రముఖ వైద్యులు, ఎపి మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒక్కసారి ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే ఆర్థికంగా చితికిపోతున్న సంఘటనలు నేడు గమనిస్తున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఆస్పత్రుల సేవలను విస్తృత పర్చాల్సిన అవసరం ఉందని వివరించారు. చర్చా గోష్ఠికి అధ్యక్షత వహించిన డాక్టర్ ఎ సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ గత 37 ఏళ్లుగా విద్య, వైద్య రంగాలపై జెవివి కృషి చేస్తోందని, ప్రభుత్వ వైద్య కళాశాలలపై ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో జెవివి జిల్లా కోశాధికారి జి వెంకటరావు, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, నేస్తం సహ వ్యవస్థాపకులు టి ధనుంజయరెడ్డి, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిస్టీ, కౌలు రైతుల సంఘం నాయకులు అజయ్ కుమార్, మెడికల్ రిప్రజెంటిటీస్ యూనియన్ నాయకులు కుమార్, శ్రీనివాస్, సలీం పాల్గొని ప్రసంగించారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు


జాతీయస్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రతినిధులు

తిరుపతిలో జాతీయ స్థాయి సహకార వర్క్‌షాప్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

'సహకార రంగం అభివృద్ధి -డిజిటలైజేషన్, గ్రెన్ స్టోరేజ్, ఎం-పిఎసిఎస్ విస్తరణ, కో-ఆపరేటివ్ బ్యాంకింగ్ బలపరిచే దిశ' అనే అంశంపై రెండు రోజుల జాతీయస్థాయి వర్క్‌షాప్ బుధవారం తిరుపతి తాజ్ హోటల్‌లో ప్రారంభమైంది. భారత ప్రభుత్వం సహకార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖతో కలిసి నిర్వహిస్తున్న ఈ సదస్సును రాష్ట్ర సహకార కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్ ఎ బాబు, భారత ప్రభుత్వ సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి డాక్టర్ అశీష్ కుమార్ భూటాని, అదనపు కార్యదర్శులు పంకజ్ కుమార్ బన్సాల్, రవీంద్ర కుమార్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శులు ఆనంద్ కుమార్ ఝా, రమణ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా అశీష్ కుమార్ భూటాని మాట్లాడుతూ గత మిస్సోరీలో జరిగిన సహకార మంత్రుల సమావేశంలో చర్చించిన విషయాలను, విధానాల అమలు స్థితిని సైతం సమీక్షిస్తామన్నారు. కొత్త రంగాల్లో తాము చేస్తున్న ప్రయత్నాలపైనా చర్చ జరుగుతుందని తెలిపారు. సహకార ట్యాక్సీలు, ఇన్సూరెన్స్ రంగం మొదలైన వాటిలో రాష్ట్రాల భాగస్వామ్యం ఎలా ఉండాలో పరిశీలిస్తామన్నారు. సెప్టెంబర్ 1 నుంచి త్రిభువన్ శేఖర్ విశ్వవిద్యాలయం నుంచి తరగతులు మొదలయ్యాయని, రాష్ట్రాలలో సహకార విద్యావ్యవస్థను ఎలా అనుసంధానించాలో, పాఠశాలలు ఎలా స్థాపించాలో ఈ విషయాలపై చర్చించనున్నామని వివరించారు. ఎ బాబు మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పిఎసిఎస్‌లు) సంవత్సరాలుగా పాత విధానాలే కొనసాగిస్తూ, పరిమిత వనరులతో, సభ్యులను ఆకర్షించలేకపోతున్నామని, సాంకేతికతను పరిష్కారంగా భావించినా, అప్పటి ప్రయత్నాలు అసంపూర్ణంగా మిగిలిపోయాయని, విస్తృత స్థాయిలో అమలు కాలేకపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో దేశంలోని అన్ని రాష్ట్రాల సహకార సంఘాల కార్యదర్శులు, రిజిస్ట్రార్లు, సహకార మంత్రిత్వశాఖ, నాబార్డ్, ఎన్‌సిడిసి పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో ఎపిఇఆర్‌సి ఛైర్మన్

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి (ఎపిఇఆర్‌సి) ఛైర్మన్ పి వెంకట రామారెడ్డి బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించు కున్నారు. ఆయన వెంట ఎపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్/ఐటి) పి.అయూబ్ ఖాన్, సూపరింటెండింగ్ ఇంజనీర్ వి చంద్రశేఖర రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి గంగాధర్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె జయప్రకాష్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి వెంకటరమణ తదితరులు ఉన్నారు.


ఆలయం వద్ద వెంకటరామారెడ్డి కుటుంబం


అభ్యర్థులు చెబుతున్న సమస్యలను వింటున్న జగన్‌మోహన్‌రెడ్డి

జగన్‌ను కలిసిన డిఎస్‌సి అభ్యర్థులు

ప్రజాశక్తి- తాడేపల్లి, భీమవరం టౌన్, కాళ్ల

తమకు అన్యాయం జరిగిందని, డిఎస్‌సిని రద్దు చేయాలని పలువురు అభ్యర్థులు మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. బుధవారం భీమవరం పర్యటనకు వెళ్తున్న జగన్‌ను తాడేపల్లిలో అభ్యర్థులు కలిశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ జగన్ కాన్వాయ్‌ను ఆపి తమ సమస్యలను వివరించారు. జిఒ 77ను సరిగా అమలు చేయలేదని, మెరిట్ అభ్యర్థులను రిజర్వేషన్‌లోకి మార్చారని, దీనివల్ల రిజర్వేషన్ ఉన్న అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పారు. దీనిపై తాము విద్యాశాఖ మంత్రిని, అధికారులను కలిసినా సరైన సమాధానం చెప్పలేదన్నారు. ఇప్పటికే డిఎస్‌సిని రద్దు చేయాలని తాము కోర్టును ఆశ్రయించామన్నారు. సమస్యను విన్న జగన్ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే ప్రసాదరాజు కుమారుడి వివాహ వేడుకల్లో మాజీ సిఎం

వైసిపి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కుమారుని వివాహానికి మాజీ సిఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. కాళ్ల మండలం పెదఅమిరం గ్రామ పరిధిలోని రాధాకృష్ణ కన్వెన్షన్ హాల్లో ప్రసాద్‌రాజు కుమారుడు వివాహం జరిగింది. నూతన వధూవరులు శ్రీకృష్ణ, దివ్యలను జగన్ ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రసాదరాజు కుటుంబసభ్యులతోనూ, పార్టీ నాయకులతోనూ ఆయన మాట్లాడారు.

డిజిటలీకరణతో తక్షణమే రుణాలు

- ఎంఎస్‌ఎంఇలకు రూ.5 కోట్ల వరకు అప్పు
- త్వరలో యోనో యాప్ ఆధునీకరణ
- ఎస్‌బిఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి వెల్లడి



ముంబయి : డిజిటలీకరణ ఫైనాన్సియల్ రంగం రూపురేఖలనే మార్చేసిందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ఇప్పుడు నిమిషాల్లోనే రుణాలు మంజూరు జరుగుతోందన్నారు. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025 ఈవెంట్‌లో శ్రీనివాసులు మాట్లాడుతూ.. డిజిటల్ వ్యవస్థల కారణంగా ఎంఎస్‌ఎంఇలకు కేవలం 25-26 నిమిషాల్లో రూ.5 కోట్ల వరకు రుణానికి ఆమోదం లభిస్తోందని తెలిపారు. డిజిటలీకరణ వల్ల ఇన్సూరెన్స్ వంటి ఆర్థిక ఉత్పత్తుల వినియోగం పెరిగిందన్నారు. కెవైసి నిబంధనలను మరింత సరళతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం, రెగ్యులేటరీ సంస్థలతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. కెవైసి, రీ-కెవైసి ప్రక్రియలను సరళీ కరించడం కస్టమర్లకు, బ్యాంకులకు చాలా ముఖ్యమన్నారు. కస్టమర్ డేటాను అప్‌డేట్ చేయడం, మోసాలను నివారించడం లక్ష్యంగా ఉన్నప్పటికీ, విభిన్న పద్ధతుల వల్ల రీ-కెవైసి చాలా మందికి సమస్యగా మారిందన్నారు.

ఒక్క ఎస్‌బిఐ ద్వారా 15 కోట్ల జన్‌ధన్ జీరో బ్యాలెన్స్ ఖాతాలు తెరిచామని చెప్పారు. సగటున రూ.4వేలు చొప్పున ఒక్కో బ్యాంకు ఖాతాలో నగదు ఉందని, ఈ ఖాతాల ద్వారా రోజుకు 35 లక్షల లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. ఈ ఖాతాలు 56 శాతం మహిళలవే అని తెలిపారు. త్వరలో యోనో యాప్‌ను మరింత ఆధునీకరించనున్నామని చెప్పారు. ఇందుకోసం 12 ఫిన్‌టెక్ సంస్థలతో పని చెస్తోన్నామని పేర్కొన్నారు. మొబైల్ బ్యాంకింగ్ మాత్రమే కాకుండా మరిన్ని సదుపాయాలు ఇందులో అందుబాటులోకి రానున్నాయన్నారు. "ఎస్‌బిఐకి ప్రస్తుతం 1.6 లక్షల టచ్‌పాయింట్లు ఉన్నాయి. డిజిటల్ ఛానెళ్లతో పాటు, దేశవ్యాప్తంగా సేవలు అందుబాటులో ఉండేలా భౌతిక ఔట్‌లెట్‌లను కూడా మెరుగుపరుస్తున్నాము. మా బ్యాంక్ 60 శాతం శాఖలు గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లోనే ఉన్నాయి. ఎస్‌బిఐలో 25 లక్షల మంది బిజినెస్ కరస్పాండెంట్లు పని చేస్తున్నారు. మేము 52 కోట్ల మంది ఖాతాదారులకు సేవలు అందిస్తున్నాము. దేశ జనాభా, భౌగోళిక వైవిధ్యం కారణంగా బ్యాంకింగ్ సేవల లభ్యతను పెంచడం ఓ సవాల్‌గా ఉంది. ఎస్‌బిఐ సాధారణ బ్యాంకింగ్ నుండి వెల్త్ మేనేజ్‌మెంట్ వరకు అన్ని సేవలు అందిస్తుంది." అని శ్రీనివాసులు శెట్టి తెలిపారు.

వివాదాలను అంతర్గతంగా పరిష్కరించుకోవాలి

- టాటా గ్రూపునకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ : టాటా ట్రస్ట్‌లో బోర్డు నియామకాలు, పాలనా అంశాల్లో నెలకొన్న వివాదాలను అంతర్గంగా పరిష్కరించుకోవాలని కేంద్రం సూచించింది. టాటా గ్రూప్‌లోని కీలక వ్యక్తులు అయినటువంటి టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా, వైస్ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్, టాటా సన్స్ ప్రయివేటు లిమిటెడ్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖర్, ట్రస్టీ డారియస్‌తో మంగళవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సమావేశమయ్యారు. వివాదాలను అంతర్గతంగా పరిష్కరించుకోవాలని వారు సూచించారు. అవసరమైతే సమస్యకు కారణమయ్యే ట్రస్టీని తొలగించే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించినట్లు రిపోర్టులు వస్తోన్నాయి. దాదాపు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో ఎలాంటి చర్యలు చేపట్టయినా సరే టాటా ట్రస్ట్స్‌లో స్థిరత్వాన్ని పునరుద్ధరించాలని మంత్రులు సూచించారని తెలుస్తోంది. భారత ఆర్థికవ్యవస్థకు టాటా గ్రూప్ సహకారం చాలా ముఖ్యమైందని.. కంపెనీలో ఎలాంటి వివాదమైనా సరే దాన్ని అంతర్గతంగా, వివేకంతో పరిష్కరించుకునేలా చర్యలు ఉండాలని మంత్రులు సూచించారని సమాచారం.

మాంద్యం అంచున అమెరికా..!

- ఆర్థిక నిపుణుల హెచ్చరిక



వాషింగ్టన్ : అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యం అంచున ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తు న్నారు. టెక్నాలజీ పెట్టుబడులపై యుఎస్ ఎక్కువగా ఆధారపడటం వల్ల తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంటోం దని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిస్ట్ పేర్కొన్నారు. ఈ రంగంలో మందగమనం సంభవిస్తే యుఎస్ ఆర్థిక వృద్ధి తీవ్రంగా దెబ్బతినవచ్చని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ ప్రముఖ ఆర్థికవేత్త అడమ్ స్లేటర్ తెలిపారు. టెక్ రంగం లేకుండా 2025 ప్రథమార్థంలో అమెరికా జిడిపి పెరిగి ఉండేది కాదన్నారు. వ్యాపార పెట్టుబడులు తగ్గి ఉండేవన్నారు. టెక్ రంగంలో క్షీణత సంభవిస్తే 2026లో అమెరికా జిడిపి ఏకంగా 0.8 శాతానికి పడిపోవచ్చని హెచ్చరించారు. ఇది మాంద్యానికి చేరువలో ఉన్నట్టేనన్నారు. గ్లోబల్ వృద్ధి కూడా 2.5 శాతం నుంచి 2 శాతానికి తగ్గవచ్చన్నారు. మెక్సికో, కెనడా, వియత్నాం, తైవాన్, దక్షిణ కొరియా, మరియు మలేషియా వంటి దేశాలు గణనీయమైన ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొంటాయన్నారు.

మూడీస్ అనలిటిక్స్ ప్రధాన ఆర్థికవేత్త మార్క్ జాండి విశ్లేషణ ప్రకారం.. యుఎస్ ఆర్థిక వ్యవస్థ ప్రమాదకర పరిస్థితిలోకి ప్రవేశించనుంది. 22 రాష్ట్రాలు సహా డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియా ఇప్పటికే ఆర్థిక బలహీనత, ఉద్యోగ నష్టాలను ఎదుర్కొంటున్నాయి. కాలిఫోర్నియా, న్యూయార్క్ స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి కష్టపడుతున్నాయి. ఈ రాష్ట్రాలలో ఏ ఒక్కటి జిడిపి క్షీణించిన జాతీయ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారిపోవచ్చని జాండి హెచ్చరించారు. జార్జియా ఇప్పటికే మాంద్యంలో ఉందని, గృహ ఖర్చులు ఎక్కువగా ఉండటం వల్ల దేశీయ వలసలు తగ్గాయన్నారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు సరఫరా గొలుసులను అంతరాయం కలిగించాయని, కంపెనీలు విస్తరణ ప్రణాళికలను నిలిపివేయడానికి అనిశ్చితిని సృష్టించడానికి కారణమయ్యాయని జాండి తెలిపారు.

మార్కెట్ల నాలుగు రోజుల లాభాలకు తెర

ముంబయి : వరుసగా నాలుగు సెషన్లలో లాభాల్లో సాగిన భారత మార్కెట్లు బుధవారం నష్టాలను చవి చూశాయి. సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు బలహీనంగా ఉండొచ్చనే అంచనాలకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ఈ పరిణామాలతో బిఎస్‌ఇ సెన్సెక్స్ 153 పాయింట్లు లేదా 0.19 శాతం నష్టంతో 81,773కు దిగజారింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 62 పాయింట్లు లేదా 0.25 శాతం తగ్గి 25,046 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బిఇఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్ షేర్లు అధికంగా నష్టపోగా.. టైటాన్, ఇన్ఫోసిస్, టిసిఎస్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా షేర్లు ఎక్కువగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

మారుతి సుజుకి 5వేల ఎరినా సర్వీస్ సెంటర్లకు విస్తరణ

కోయంబత్తూరు : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి తన ఎరినా సర్వీసు సెంటర్లను 5,000కు విస్తరించినట్లు వెల్లడించింది. కోయంబత్తూరులో నూతన అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఈ మైలురాయికి చేరామని తెలిపింది. దీన్ని ఆ కంపెనీ సర్వీసు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామ్ సురేష్ అకెల్లా, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టకహిరో శిరశి లాంచనంగా ప్రారంభించారు.

2024-25లో తాము 460 అరెనా, నెక్సా టచ్ పాయింట్లను తెరిచామని ఆ కంపెనీ తెలిపింది. 2025-26లో తమ సర్వీసు నెట్‌వర్క్‌లో మరో 500 జోడించనున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం 2,818 నగరాలు, పట్టణాల్లో కార్యకలాపాలను కలిగి ఉన్నట్లు తెలిపింది.

సంపాదకీయం


కీలకంగా బీహార్ ఎన్నికలు

ఉత్తరాది రాష్ట్రాల్లో బీహార్ మొదటి నుండి రాజకీయంగా అత్యంత చురుకుగా ఉండే రాష్ట్రంగా గుర్తింపు పొందింది. అక్కడ చోటుచేసుకునే పరిణామాలు అనేక సందర్భాలలో దేశ వ్యాప్తంగా ప్రభావం చూపాయి. దేశ రాజకీయాలకు దిశా నిర్దేశం చేశాయి. ఈ నేపథ్యంలోనే అక్కడ జరగనున్న ఎన్నికలు ఆ రాష్ట్రానికే కాకుండా దేశానికే కీలకంగా మారాయి. బీహార్‌లో అధికారంలో కొనసాగడమే లక్ష్యంగా బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి ఎన్నో అడ్డదారులు తొక్కుతోంది. హడావిడిగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్)తో ఎన్నికల కమిషన్ స్వతంత్రత ప్రశ్నార్ధకంగా మారింది. పెద్దఎత్తున ఓట్ చోరీ ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటికి జవాబు ఇచ్చి, సందేహాలను నివృత్తి చేయాల్సిన ఎన్నికల కమిషన్ (ఇసి) గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతిపక్షాలపై దాడికి దిగుతోంది. ఓటర్ల జాబితాపై కొనసాగుతున్న నిరసనల మధ్యే తుది జాబితాను, ఎన్నికల షెడ్యూల్‌ను ఇసి విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం 243 మంది సభ్యులుగల బీహార్ శాసనసభకు నవంబర్ 6, 11 తేదీలలో పోలింగ్ జరగనుంది. 14వ తేదీన ఫలితాలు ప్రకటిస్తారు. మరోవైపు ఇసి విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాపై కూడా దుమారం రేగుతోంది. ఈ జాబితాలోని చేర్పులు, తొలగింపులకు సంబంధించిన పూర్తి వివరాలను తమకు అందచేయడంతో పాటు, వాటిని క్షేత్రస్థాయి వరకు ప్రదర్శించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఎన్నికల కమిషన్‌ను మంగళవారం ఆదేశించింది. తుది జాబితాలో తొలగింపునకు గురైన వారి అప్పీల్ హక్కుతో పాటు, ముసాయిదా జాబితాతో పోలిస్తే కొత్తగా ఓటు హక్కు పొందిన లక్షలాది మంది గుర్తింపునకు సంబంధించి కూడా సుప్రీంకోర్టు ధర్మాసనం ఎన్నో ప్రశ్నలు వేసింది. ఓటర్ల జాబితాను పారదర్శకంగా ఉంచాలని ఇసికి సూచించింది.

తుది జాబితా ప్రకారం 7.42 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే అధికారిక లెక్కల ప్రకారమే బీహార్‌లో వయోజన జనాభా ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 8.22 కోట్లు! దీనిని పరిగణలోకి తీసుకుంటే బీహార్ జనాభాలో పది శాతం మంది ఓటు హక్కు కోల్పోయారు. దేశ ఎన్నికల చరిత్రలోనే ఒక రాష్ట్రంలో ఇంతమంది ఓటుహక్కు కోల్పోవడం ఒక రికార్డు! అంతేకాదు, ముసాయిదా జాబితాలో ఓటు హక్కు కోల్పోయిన వారిలో 25 శాతం, తుది జాబితాలో ఓటు హక్కు కోల్పోయిన వారిలో 34 శాతం మంది ముస్లింలే! మొత్తం మీద ఆరు లక్షల మంది ముస్లింలు ఓటర్ల జాబితా నుండి తొలగింపునకు గురైనట్లు వార్తలు వస్తున్నాయి. దీని లక్ష్యం ఏమిటో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మహిళల ఓట్లు కూడా పెద్ద సంఖ్యలో గల్లంతైనట్లు చెబుతున్నారు. ముసాయిదాతో పోలిస్తే తుది జాబితాలో కొత్తగా ఓటర్ల జాబితాలో స్థానం పొందిన వాటిలో లక్షల సంఖ్యలో నకిలీ పేర్లు ఉన్నాయన్న అంశం సైతం ఇప్పటికే సుప్రీంకోర్టు పరిశీలనలో ఉంది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌కు తాజాగా చేసిన ఆదేశాలు ప్రాధాన్యత నంతరించుకున్నాయి. అయితే, ఇప్పటికే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారిన ఇసి వాటిని ఏమాత్రం పాటిస్తుందో వేచి చూడాల్సిందే!

మరోవైపు ఎన్‌డిఎ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న నితిష్ కుమార్ ఇప్పటికే 9 సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. పదోసారి కూడా ఆ పదవిని ఆయన ఆశిస్తున్నారు. బిజెపి నేతలు ఆ విషయాన్ని తేల్చకుండా రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలకు మాత్రం నితీష్‌ను పూర్తి బాధ్యుడిని చేస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ఓటర్లను మభ్య పెట్టే కుతంత్రాలకు తెరతీస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాబోయే రోజుల్లో ఈ తరహా విన్యాసాలు మరింత జోరందుకోనున్నాయి. 2020లో జరిగిన ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి కేవలం 0.2 శాతం ఓట్ల ఆధిక్యతను మాత్రమే సాధించింది. దీంతో త్వరలో జరగనున్న ఎన్నికలలో ప్రతి ఓటు కీలకంగా మారనుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని దళితులు, మైనార్టీల ఓటు హక్కుకు గండికొట్టే ప్రతి ప్రయత్నాన్ని చివరి వరకు అడ్డుకోవాల్సి ఉంది. అదే సమయంలో ప్రతిపక్షాల మధ్య గరిష్ట స్థాయిలో ఐక్యత పెరగాల్సి ఉంది. గత ఎన్నికల్లో చోటు చేసుకున్న తప్పులు మరోసారి జరగకుండా చూసుకోవడంతో పాటు, ప్రజలకు నమ్మకం ఇయ్యవలసిన బాధ్యత ప్రతిపక్షాలదే! ఈ తరహా కృషి దేశ లౌకిక పునాదిని కాపాడుతుంది. అదే జరిగితే మరోసారి దేశానికి దిశా నిర్దేశం చేసిన ఘనత బీహార్‌కు దక్కుతుంది.

మహనీయుల మాట



ఒకరి కాలి కింద బానిసలా
నీచంగా బతికే బదులు
లేచి నిలబడి
ప్రాణం విడిచి పెట్టడం మేలు.
- చే గువేరా
జననం: 14.6.1928
మరణం: 9.10.1967

విశ్లేషణ

గంగపుత్రుల ఘోష

> మత్స్య సంపదను అభివృద్ధి చేసేందుకుగాను ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే నెలలో 45 రోజులు పాటు హాలిడే ప్రకటిస్తారు. అలాంటిది 365 రోజులూ పరిశ్రమలు ఉండి, సముద్రం విషతుల్యంగా మారితే తమ జీవన పరిస్థితి ఏమిటనే ఆందోళన వారికి వుంది. ఇప్పటికే హెటిరో మందుల కంపెనీ వల్ల ఈ ప్రాంత మత్స్యకారులకు సముద్రంలో వేట జరగక వలసలు పోయి పస్తులుంటున్నారు. అలాంటిది 'రేపు బల్క్ డ్రగ్ పార్క్ వస్తే మా జీవితాలకు భద్రతత ఏమిట'ని మత్స్యకారులు కుమిలిపోతున్నారు.



నక్కపల్లి రాజయ్యపేటలో హోం మంత్రి అనితను అడ్డుకున్న ప్రజలు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనిత సొంత నియోజకవర్గాల్లో గంగపుత్రులు ఆగ్రహించారు. దీనికి ప్రధాన కారణం పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యం. తమ ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందనే అభద్రతా భావం. ఇలాంటి పరిస్థితుల్లో గంగపుత్రులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఉప్పాడ వద్ద పరిశ్రమల వ్యర్థాలతో సముద్రం కలుషితం అవుతున్నదని, ఒ.ఎన్.జి.సి కార్యకలాపాల వల్ల వేటకు ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తూ వారు రోడ్ల మీదకు వచ్చారు. ఇటు అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో కాలుష్యకారకమైన బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ నిరసన తెలియచేస్తున్న మత్స్యకారులు హోంమంత్రిని నిలదీయాల్సి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా తీర ప్రాంతాన్ని కాలుష్య ప్రాంతంగా మార్చటం పర్యావరణానికి తీవ్ర ప్రమాదం. మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోతుంది. భూగర్భ జలాలు కలుషితమౌతాయి.

పెట్టుబడులకు సింగిల్ విండో పథకం ద్వారా అనుమతులు ఇస్తున్నారు. దీనితో పెట్టుబడిదారులు ముఖ్యంగా ఫార్మా కంపెనీలు ఈ ప్రాంతంలో విస్తరిస్తున్నాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారు. తీర ప్రాంత మత్స్యకారులు ఉపాధి లేక వలస బాట పడుతున్నారు.



కె. లోకనాథం

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో 'బల్క్ డ్రగ్ పార్క్ వద్దు, గంగమ్మ తల్లి ముద్దు' అంటూ స్థానిక మత్స్యకారులు, ప్రజలు గత 25 రోజుల నుండి నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. బల్క్‌డ్రగ్ పార్క్ కోసం 2025 ఆగస్టు 6న పోలీసుల నిర్బంధంతో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేసి, గృహ నిర్బంధాలు ప్రయోగించారు. అయినప్పటికీ స్థానిక టిడిపి, జనసేన, వైసిపి పార్టీల శ్రేణులు, సాంప్రదాయ మత్స్యకారులు పాల్గొని ముక్త కంఠంతో వ్యతిరేకించారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా బల్క్ డ్రగ్ పార్కుకు కావలసిన రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టింది. దీంతో ఆగ్రహించిన మత్స్యకారులు నిరసనకు దిగారు. పోలీసులు మొదట అనుమతి ఇవ్వలేదు. మండుటెండల్లోను తమ గ్రామంలో కాలుతున్న ఇసుకలో కూర్చొని పట్టుదలగా గొడుగులతో నిరసన కార్యక్రమం మొదలుపెట్టారు. వారి పోరాటానికి అన్ని పక్షాలవారు మద్దతు తెలపడంతో టెంట్ వేసుకోవడానికి పోలీసులు అనుమతులు ఇచ్చారు. శాంతియుతంగా నిరసన చేపడుతున్నారు.

ఇంతలోనే బల్క్ డ్రగ్ పార్కు సమీపంలో ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం ప్రజాభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టారు. దీనితో స్థానిక మత్స్యకారులు పోరాటాన్ని ఉధృతం చేశారు. చివరికి, 'సెప్టెంబర్ 30న వచ్చి మీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాన'నే వీడియో సందేశాన్ని హోం మంత్రి ప్రజలకు పంపించారు. దీనితో మత్స్యకారులు తమ సమస్య పరిష్కారం అవుతుందని ఎదురు చూశారు. ఒకరోజు ముందుగానే సెప్టెంబర్ 29న హోం మంత్రి రాజయ్యపేటలో మత్స్యకారులు చేస్తున్న దీక్షా శిబిరం వద్దకు చేరుకొని...దసరా తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వద్దకు తీసుకెళ్తానని, ఒక కమిటీగా ఏర్పాటు కావాలని సూచించారు. దీనితో అసంతృప్తిగా ఉన్న మత్స్యకారులు తీవ్ర నిరసన తెలియజేశారు. మంత్రి ప్రతిపాదనను స్థానిక ప్రజలు ఎవరూ అంగీకరించలేదు. ప్రజల నుండి తీవ్ర నిరసనను ఎదుర్కొనవలసి వచ్చింది. దీనితో హోం మంత్రి ఒక మెట్టు దిగి పనులు నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించాల్సి వచ్చింది. ఇది తాత్కాలికమైన ప్రకటన అని స్థానిక మత్స్యకారులకు అర్థమైంది. రాష్ట్ర మంత్రుల నియోజకవర్గాల్లోనే ఇలా వుంటే మిగతా చోట్ల పరిస్థితి ఎలా వుంటుందో అర్థం చేసుకోవచ్చు.

మత్స్య సంపదను అభివృద్ధి చేసేందుకుగాను ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే నెలలో 45 రోజులు పాటు హాలిడే ప్రకటిస్తారు. అలాంటిది 365 రోజులూ పరిశ్రమలు ఉండి, సముద్రం విషతుల్యంగా మారితే తమ జీవన పరిస్థితి ఏమిటనే ఆందోళన వారికి వుంది. ఇప్పటికే హెటిరో మందుల కంపెనీ వల్ల ఈ ప్రాంత మత్స్యకారులకు సముద్రంలో వేట జరగక వలసలు పోయి పస్తులుంటున్నారు. అలాంటిది 'రేపు బల్క్ డ్రగ్ పార్క్ వస్తే మా జీవితాలకు భద్రతత ఏమిట'ని మత్స్యకారులు కుమిలిపోతున్నారు.

గత ఎన్నికల ముందు రాజయ్యపేట గ్రామాన్ని సందర్శించిన వంగలపూడి అనిత విషతుల్య పరిశ్రమలకు తాను వ్యతిరేకమని తెలిపారు. హెటిరో పైప్‌లైన్ వేయడంతో చేపలు చనిపోతున్నాయని, 13 సంవత్సరాల పిల్లల నుండి పెద్ద వయస్సువారి వరకు అనేక వ్యాధులతో బాధపడుతున్నారని ఆమె అన్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తులు, చర్మవ్యాధులు, కిడ్నీ, క్యాన్సర్ వంటి వ్యాధులు రావడానికి ప్రధాన కారణం హెటిరో డ్రగ్ కాలుష్యమని స్వయంగా ఒప్పుకున్నారు. గ్రామ సభలు పెట్టకుండా, ప్రజల ఆమోదం లేకుండా బల్క్‌డగ్ర్ కంపెనీకి అనుమతులు ఇవ్వబోమని వాగ్దానం చేశారు. ఏవైనా డబ్బులిచ్చి కొనుగోలు చేయగలంగాని, ప్రాణాలను కొనలేమన్నారు. పోరాటాలతోనే రాజయ్యపేటను రక్షించుకోవాలని నాడు హితవు పలికారు. దీంతో అత్యంత విశ్వాసంతో అత్యధిక మెజారిటీతో కూటమిని గెలిపిస్తే...నేడు కూటమి ప్రభుత్వం దానికి భిన్నంగా చర్యలు తీసుకోవడంతో మత్స్యకారులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

బల్క్ డ్రగ్ పార్క్‌కు 1270 ఎకరాల భూమి కావాల్సి ఉంది. ఇందులో 450 ఎకరాల భూములు మాత్రమే ప్రభుత్వం సేకరించింది. ఇంకో 820 ఎకరాలు భూములను సేకరించాల్సి వుంది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీతో వర్చువల్‌గా శంకుస్థాపన చేయించింది. ఆ రోజున గ్రామ ప్రజలను పోలీసులు నిర్బంధించారు. పోలీసు నిర్బంధాన్ని అధిగమించిమరీ ప్లేట్లు పట్టుకొని నిరసన తెలియజేశారు. ప్రభుత్వం ఆగకుండా నిర్మాణ పనులు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుండి చట్టాన్ని గౌరవించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నది. పోలీసులు కూడా అత్యుత్సాహంతో అక్రమ కేసులు బనాయిస్తున్నారు. అయినప్పటికీ ఆత్మస్థైర్యం కోల్పోకుండా ప్రజలు పోరాటం కొనసాగిస్తున్నారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం 2020 మార్చి 20న ప్రమోషన్ ఆఫ్ బల్క్‌డ్రగ్ పార్క్ పథకాన్ని ఆమోదించింది. హిమాచల్‌ప్రదేశ్ ఉనా జిల్లా హరోలిలో, గుజరాత్ భరూచ్ జిల్లా జంబుసర్‌లో, ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ తొండంగిలో మొదటి దశ ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా కాకినాడ ప్రజలు పోరాటం చేయడం వల్ల నేడు నక్కపల్లి ప్రాంతం రాజయ్యపేటలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. దీనిని స్థానిక మత్స్యకారులు, ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలకు పోకుండా పర్యావరణాన్ని నాశనం చేసి ప్రజల జీవనానికి తీవ్ర విఘాతం కలిగించే బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలి.

/ వ్యాసకర్త రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

> గత ఎన్నికల ముందు రాజయ్యపేట గ్రామాన్ని సందర్శించిన వంగలపూడి అనిత విషతుల్య పరిశ్రమలకు తాను వ్యతిరేకమని తెలిపారు. హెటిరో పైప్‌లైన్ వేయడంతో చేపలు చనిపోతున్నాయని, 13 సంవత్సరాల పిల్లల నుండి పెద్ద వయస్సువారి వరకు అనేక వ్యాధులతో బాధపడుతున్నారని ఆమె అన్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తులు, చర్మవ్యాధులు, కిడ్నీ, క్యాన్సర్ వంటి వ్యాధులు రావడానికి ప్రధాన కారణం హెటిరో డ్రగ్ కాలుష్యమని స్వయంగా ఒప్పుకున్నారు. గ్రామ సభలు పెట్టకుండా, ప్రజల ఆమోదం లేకుండా బల్క్‌డగ్ర్ కంపెనీకి అనుమతులు ఇవ్వబోమని వాగ్దానం చేశారు. ఏవైనా డబ్బులిచ్చి కొనుగోలు చేయగలంగాని, ప్రాణాలను కొనలేమన్నారు. పోరాటాలతోనే రాజయ్యపేటను రక్షించుకోవాలని నాడు హితవు పలికారు. దీంతో అత్యంత విశ్వాసంతో అత్యధిక మెజారిటీతో కూటమిని గెలిపిస్తే... నేడు కూటమి ప్రభుత్వం దానికి భిన్నంగా చర్యలు తీసుకోవడంతో మత్స్యకారులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

కవిత్వం



తీర్పు..ఓర్పు!!

ఇది తీర్పు పైన దాడి
రాజ్యాంగం
ఓర్పు పైన దాడి "ఇది"
మతాతీత వ్యవస్థపై
మండిపాటులో మర్మం!
విచ్చలవిడిగా, వడిగా
విస్తరించు మనుధర్మం!!
ఉన్మాదం ఒళ్ళు బలిసి
అహం కళ్ళు నెత్తికెక్కి
ఎంత బరితెగించిందో
నయా సనాతన వాదం!?
"ఇది"
బలహీనుల, శ్రమజీవుల
హక్కుల రెక్కలు విరిచే
నిర్ణయాల నిరంకుశుల
నిజరూపం నిలదీసే
అత్యున్నత న్యాయస్థానాన్నే
అవమానించి "ఇది"
నాలుగు పడగల హైందవ
నాగరాజుని స్మరించి
విద్వేషము రంగరించి
విష బాండం కుమ్మరించి
పెనుగులాట, ప్రతిఘటనల
ప్రశ్నల గొంతులు నొక్కే
అగ్ర భావ ఉగ్రవాద
ఆధిపత్య ప్రయత్నమే
"ఇది".

- నల్లి ధర్మారావు

జనవాక్యం

పెరుగుతున్న నేరాలు

జాతీయ నేర గణాంకాల నివేదికను 2023 సంవత్సరానికి గాను భారత ప్రభుత్వం విడుదల చేసింది. ఈ గణాంకాలు వివిధ నేరాల పెరుగుదలను సూచిస్తున్నాయి. అందులో ముఖ్యంగా గిరిజనులపై జరిగిన నేరాల్లో, అంతకు ముందు ఏడాది కన్నా, 28 శాతం పెరుగుదల కనబడడం తీవ్ర ఆందోళన కరం. మణిపూర్ మొదటి స్థానంలో నిలవగా, మధ్యప్రదేశ్ రెండో స్థానం పొందినా...ఈ తరహా నేరాలు మిగతా రాష్ట్రాల్లో కూడా గణనీయంగానే నమోదైనాయి. పిల్లల పట్ల జరిగిన వాటిలో తొమ్మిది శాతం పెరుగుదల, మహిళల పట్ల కూడా పెరుగుదలనే చూపిస్తున్నాయి. సైబర్ నేరాలైతే మరింత దూకుడుగా ఉన్నాయి. సాధారణంగా జరిగిన నేరాలన్నీ నమోదు కావు. పోలీస్ స్టేషన్ దృష్టికి రానివి, నమోదు కానివి అధికంగానే ఉంటాయి. అధికారిక లెక్కలు పరిస్థితిని పైపైన చూపిస్తాయి. అంటే అసలు సమస్య ఇంకా తీవ్రంగానే ఉంటుంది. కఠిన చట్టాలు మాత్రమే సమస్యకు పరిష్కారం చూపలేవు. అమలు చేసే యంత్రాంగం సమర్ధత, చురుకుదనం, జవాబుదారీతనం పెంచేలా పరిస్థితులు కల్పించాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. కేసు నమోదు, దర్యాప్తు మొదలుకొని విచారణ, అంతిమ తీర్పులు శీఘ్రంగా జరగాలి. నేర నియంత్రణ, అదుపులకు ఇతర దేశాలు అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతుల్ని, ఆధునిక సాంకేతికతను అధ్యయనం చేసి దేశంలో అమలు పరచాలి.


- డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ, విజయనగరం.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

విమర్శ

రాష్ట్రంలో పని గంటల పెంపు అనుచితం

> రాష్ట్రంలో యజమానులు, పెట్టుబడిదారుల వ్యాపారాలను సులువు చేయడం కోసమే టిడిపి కూటమి ప్రభుత్వం ఈ మార్పులు చేసింది. ఈ ప్రక్రియలో కార్మిక హక్కులు కాలరాయబడ్డాయి. కార్మిక చట్టాలు ఎక్కడా అమలు కావడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ చేతులు కలిపి కార్మిక చట్టాల అమలు కోసం ఉండే తనిఖీలను ఎత్తివేశాయి. 5 సంవత్సరాలకోసారి పెంచాల్సిన కనీస వేతనాలను కూడా గత మూడు దఫాలుగా ఏ ప్రభుత్వం ఉన్నా పెంచడానికి సిద్ధపడలేదు. ఈ విధంగా తాము ఎవరి పక్కన ఉన్నామో ప్రభుత్వాలు స్పష్టంగా తెలియచేశాయి. ఇటువంటి స్థితిలో కార్మికులు తమ హక్కులను కాపాడుకునేందుకు ఐక్యం కావడం మినహా మరో మార్గం లేదు.



పి. అజయ కుమార్

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో చేసిన చర్చల తదుపరి వచ్చిన అవగాహన మేరకు...రాష్ట్ర ప్రభుత్వాలు ఫ్యాక్టరీల చట్టంలో మార్పులు చేశాయి. కొన్ని బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు, మన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 2023, 2025 సంవత్సరాల్లో ఈ మార్పులకు పూనుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ సూచనలకు పరిమితమై మిగతా రాష్ట్ర ప్రభుత్వాలు ఫ్యాక్టరీల చట్టంలో మార్పులు చేయగా, మన రాష్ట్ర ప్రభుత్వం ఆ గీతను కూడా దాటిపోయింది.

గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల సవరణల ప్రకారం గ్రూపు/ తరగతి / ఫ్యాక్టరీలలో మాత్రమే విశ్రాంతి కోసం ఇచ్చే విరామంతో సహా పని గంటలను 12 గంటల వరకు పెంచే అవకాశం వుంది. తాము అనుకున్నంత మేరకు మరలా గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలి. వారపు పని గంటలు 48కి మించకూడదు. అధిక గంటలు పని చేసేందుకు కార్మికుని రాతపూర్వక సమ్మతి ఉండాలి. 48 గంటలు పూర్తయిన తర్వాత వారంలోని మిగతా రోజులు కార్మికునికి వేతనంతో కూడిన సెలవులుగా ఉంటాయి. ఇవన్నీ కొత్త చట్టంలో భాగంగా ఉన్నాయి. ఇతర షరతులు కూడా వర్తిస్తాయి.

వారంలో 48 గంటలు మించి పని చేసినా, ఒక వారంలో 6 రోజులు చేసినపుడు ఏదైనా ఒక రోజున 9 గంటలకు మించి పని చేసినా, వారంలో 5 రోజులు పని చేసినపుడు ఏదైనా రోజున 10 గంటలకు మించి పని చేసినా, వారంలో 4 రోజులు పని చేసినపుడు ఏ రోజైనా 11.30 గంటలకు మించి పని చేసినా, సెలవు దినాల్లో పని చేసినా... ఓవర్ టైం వర్క్‌కు డబుల్ వేతనం ఇవ్వాలని కొత్త చట్టాల్లో భాగం చేశారు. 10 గంటలకు మించి పని చేస్తే వారంలో ఒకరోజు, 11.30 గంటలకు మించి పని చేస్తే 2 రోజులు అదనపు సెలవులు వస్తాయని ఈ మార్పుల్లో స్పష్టంగా ఉంది.


మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేసిన చట్ట సవరణల్లో అటువంటి గ్యారంటీలు కూడా లేవు. ఎక్కడ, ఎపుడు అనేది లేకుండా గుండుగుత్తగా అన్ని ఫ్యాక్టరీల్లో రాష్ట్రపతి ఆమోదం పొందిన తదుపరి నోటిఫికేషన్ ఇవ్వగానే ఒకేసారి అమల్లోకి వస్తాయి. కార్మికుల రాతపూర్వక సమ్మతితో పని లేదు. పని గంటల పెంపు ఏకపక్షం. దానికి అదనపు సెలవుల ప్రస్తావన కూడా లేదు.

ఫ్యాక్టరీల్లో భోజనం, రెండు టీ విరామాలతో కలిపి పని గంటలు 9. వాస్తవ పనిగంటలు 8 మాత్రమే. ఆంధ్రప్రదేశ్‌లో చేసిన సవరణల్లో 9 గంటలను 10 గంటలకు మార్చారు. భోజనం, టీ విరామాలకు ఒక గంట పోతే, మిగతా గంట అదనంగా పని చేయడంపై స్పష్టత లేదు. 10 గంటలు దాటి పని చేస్తే రెట్టింపు వేతనాలు (ఓటీ) ఇవ్వాలని మాత్రమే ఉంది.

అదివరకు 9 గంటలు (భోజన, టీ విరామాలతో కలిపి) దాటితే ఓటీ ఇవ్వాలి. ఇప్పుడు భోజనం, టీ విరామాలతో కలిపి 9 గంటలు దాటిన తర్వాత ఒక గంట ఓటీ ఇస్తారా? లేక వారంలో ఒక రోజు అదనపు సెలవు ఇస్తారా? అనే విషయంలో కూడా స్పష్టత లేదు. కర్ణాటక, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వారంలో 5 రోజులు పని చేసినపుడు 10 గంటలు మించి పని చేసినందుకు ఓటీ ఇవ్వాలని మార్పు చేశారు. ఆంధ్రప్రదేశ్ సవరణలో ఈ వెసులుబాటు కూడా లేదు. రాష్ట్రంలో కార్మికులంటే ఇంత అలుసా? కార్మికులను పీడించేందుకు యజమానులకు ఇంత వెసులుబాటు ఎందుకు కల్పించాలి?

మోడీ ప్రభుత్వం 2020లో తీసుకొచ్చిన కొత్త వర్కింగ్ కండిషన్స్ కోడ్‌లో కూడా రోజు పని గంటలు 8 గానే (25(1)(ఎ)) ఉన్నాయి. కనీసం అరగంట విశ్రాంతి పొందడానికి 5 గంటలు మించి పని చేయకూడదని (నిబంధన 28(3)) కూడా పాత నిబంధనలో ఉంది. అటువంటప్పుడు తాను చేయని పనులను మోడీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలతో ఎందుకు చేయిస్తోంది? కార్మికుల పని గంటలతో ఆడుకోమని (టింకరింగ్) రాష్ట్ర ప్రభుత్వాలను ఎందుకు ప్రోత్సహించింది? అన్ని రాష్ట్రాలు చేసిన సవరణల ప్రకారం 6 గంటలు పని చేసిన తర్వాతనే భోజన విరామం ఉంటుంది.

పని గంటలకు - విస్తరణ పని గంటలకు తేడా ఉంది. ఈ తేడాను గుర్తించకుండా మాట్లాడితే కార్మికులకు నష్టం జరుగుతుంది. ఇప్పటి వరకూ ఫ్యాక్టరీల చట్టం ప్రకారం రోజు పని గంటలు 8. విస్తరణ పని గంటలు 10.30. ఈ 10.30 గంటలను ఇప్పుడు లేబర్ కోడ్ లోనూ, రాష్ట్రం లోనూ 12 గంటలకు పెంచారు. ప్రత్యేక అవసరాల్లో, ప్రత్యేక సందర్భాల్లో కార్మికులకు ముందుగా నోటీసులో తెలియజేసి 8 గంటల పనిని 10.30 గంటల వ్యవధిలో తీసుకోవాలి. దీన్ని ఇపుడు 12 గంటల వ్యవధిలో తీసుకోవచ్చు.



ఉదాహరణకు ఫ్యాక్టరీ కార్మికుడిని ఉదయం 6 గంటలకు వచ్చి 10 గంటల వరకు పని చేసి వెళ్లమని, తరువాత మరలా మధ్యాహ్నం 2 గంటలకు వచ్చి 6 గంటల వరకు పని చేయమని యజమాని ముందుగా నోటీసు ద్వారా తెలియజేయాలి. ఈ ఉదాహరణలో కార్మికుడు ఉదయం 4 గంటలు పని చేసిన తర్వాత 4 గంటలు విశ్రాంతి తీసుకుని మరలా వచ్చి మిగతా 4 గంటల పని పూర్తి చేయాలి. పని గంటలు 8 గానే ఉన్నాయి. విస్తరణ పని గంటలు మధ్యలో ఉన్న విరామాలతో కలిపి 12 గంటలుగా మారాయి.

సవరణలు ఆమోదం పొందిన తర్వాత విస్తరణ పని గంటలు పెంచడానికి ఫ్యాక్టరీల ముఖ్య తనిఖీ అధికారి అనుమతి అవసరం లేదు. కాకపోతే మరో గంట పెంచాలంటే ఆ అధికారి రాతపూర్వక అనుమతి కావాలి. సవరణకు ముందు విస్తరణ పని గంటలు 10.30 మాత్రమే ఉన్నాయి. కాబట్టి పెరిగిన విస్తరణ పని కాలానికి అధికారి నుండి రాతపూర్వక అనుమతి పొందాలి. ఉదయం, సాయంత్రం పని చేసి మధ్యలో కొన్ని గంటల పాటు మూతపడే క్యాంటిన్లు, సంస్థలు, షాపులు, రెస్టారెంట్లు, షిఫ్ట్ బ్యాంకింగ్‌కు కూడా విస్తరణ పని గంటలు వర్తిస్తాయి. 8 గంటలు పని జోలికి పోవడమే పొరపాటు. మన దేశంలోని కార్మిక సంఘాలు వారపు పని గంటలను 48 నుండి 35కు తగ్గించాలని, రోజుకు పని గంటలను 7కు తగ్గించి, వారానికి 5 రోజులు మాత్రమే పని ఉండాలని కోరుతున్నాయి. ఆధునీకరణల వలన కార్మికుల ఉత్పాదకత శక్తి పెరిగినందున పని గంటల తగ్గింపు కోర్కె ముందుకు వచ్చింది. ఆ విధంగా తగ్గిస్తే కార్మికులకు కూడా తాము పెంచిన ఉత్పాదకతకు తగిన భాగం దక్కుతుంది. 2025 జులై 9న కార్మిక సంఘాలు, స్వతంత్ర ఉద్యోగ సంఘాలు నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఇది ప్రధాన డిమాండ్‌గా ఉంది. అటువంటి కోర్కెను మన్నించకపోగా, ప్రపంచ దేశాలన్నీ ఆమోదించిన 8 గంటలు పనికి, 8 గంటలు కుటుంబానికి, సామాజిక కార్యక్రమాలకు, 8 గంటలు విశ్రాంతికి ఉన్న వాటిని మార్పులు చేయడం కార్మికులకు నష్టం చేస్తుంది.

రాష్ట్రంలో ఫ్యాక్టరీల చట్టంతో పాటు షాపులు, సంస్థల చట్టంలో కూడా అదే మాదిరిగా పని గంటలు, విస్తరణ పని గంటలు పెంచారు. ఫ్యాక్టరీల్లోను, షాపులు, సంస్థల్లో కూడా రాత్రి 7 గంటల తర్వాత, ఉదయం 6 గంటల్లోపు మహిళలకు తగిన రక్షణ, రవాణా సదుపాయాలు కల్పించి వారి రాతపూర్వక సమ్మతితో రాత్రి పని చేయించుకోవచ్చని మార్పులు చేశారు. ఇవే చట్టాల్లో ఇంతకు ముందు కూడా ఇటువంటి అవకాశాలు కొన్ని షరతులకు లోబడి ఉన్నాయి. వాటిపైన సమీక్ష చేయకుండానే, ఎంత మంది మహిళలు రాత్రి పని చేయడానికి సిద్ధపడ్డారో చెప్పకుండానే మరలా ప్రభుత్వాలు పాత పాట పాడాయి. కార్మిక చట్టాలు అమలు కాని నేటి పరిస్థితుల్లో మహిళల రక్షణను విస్మరించడం సరికాదు.

కూటమి ప్రభుత్వం కార్మిక సంఘాలతో, ప్రతిపాదిత మార్పులపై చర్చించకుండా చట్టాలను ఏక పక్షంగా మార్చింది. యజమానుల సంఘాలు కూడా ఇటువంటి మార్పులు కోరిన దాఖలాలు లేవు. కార్మికులు వారానికి 90 గంటలు పని చేయాలని ఎల్ అండ్ టి అధినేత అరవింద్ సుబ్రమణ్యన్ చెప్పినందుకు, 70 గంటలు పని చేయాలని ఇన్ఫోసిస్ మాజీ అధినేత నారాయణ మూర్తి చెప్పినప్పుడు వారిపై పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగాయి. చివరికి సుబ్రమణ్యన్ తరపున ఎల్ అండ్ టి ప్రకటన చేయాల్సి వచ్చింది. ఇన్ఫోసిస్‌తో సహా ఐటీ సంస్థలన్నీ పని గంటలు పెంచడం సరికాదని, సరైన విశ్రాంతి లేకుండా ఉద్యోగులు పనిచేస్తే సరైన ఫలితాలు రావని చెప్పాయి.

రాష్ట్రంలో యజమానులు, పెట్టుబడిదారుల వ్యాపారాలను సులువు చేయడం కోసమే టిడిపి కూటమి ప్రభుత్వం ఈ మార్పులు చేసింది. ఈ ప్రక్రియలో కార్మిక హక్కులు కాలరాయబడ్డాయి. కార్మిక చట్టాలు ఎక్కడా అమలు కావడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ చేతులు కలిపి కార్మిక చట్టాల అమలు కోసం ఉండే తనిఖీలను ఎత్తివేశాయి. 5 సంవత్సరాలకోసారి పెంచాల్సిన కనీస వేతనాలను కూడా గత మూడు దఫాలుగా ఏ ప్రభుత్వం ఉన్నా పెంచడానికి సిద్ధపడలేదు.

ఈ విధంగా తాము ఎవరి పక్కన ఉన్నామో ప్రభుత్వాలు స్పష్టంగా తెలియచేశాయి. ఇటువంటి స్థితిలో కార్మికులు తమ హక్కులను కాపాడుకునేందుకు ఐక్యం కావడం మినహా మరో మార్గం లేదు.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు /

ఇఫ్లూ యూనివర్శిటీ విద్యార్థులపై ఎబివిపి దాడి..

- పాలస్తీనా మద్దతుగా జరిగిన నిరసనలో ఘర్షణ
- ఇజ్రాయిల్‌కు మద్దతుగా ఎబివిపి నినాదాలు.



హైదరాబాద్ : ఇఫ్లూ యూనివర్శిటీ విద్యార్థులపై ఎబివిపి దాడి చేసింది. ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్శిటి (ఇఎఫ్ఎల్‌యు)లో మంగళవారం పాలస్తీనాకు మద్దతుగా స్టూడెంట్స్ యూనియన్ నిరసన చేపట్టారు.. ఈ నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై ఎబివిపి గూండాలు దాడి చేసి, ఇజ్రాయిల్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. పాలస్తీనాకు మద్దతుదారులు " దేశ ద్రోహులు " అని రెచ్చగొట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు విద్యార్థులను చెదరగొట్టారు. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ), నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ), ఫ్రటర్నిటీ మూవ్‌మెంట్ , తెలుగు స్టూడెంట్స్ ఫెడరేషన్ (టిఎస్ఎఫ్) వంటి విద్యార్థి సంఘాలతో కూడిన ఇఫ్లూ స్టూడెంట్స్ యూనియన్ ఈ నిరసనను నిర్వహించింది. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వ్యతిరేకిస్తూ, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమానికి అండగా ఈ నిరసన జరిగింది. అయితే ఈ నిరసన వద్దకు ఎబివిపి కార్యకర్తలు చేరుకుని ఇజ్రాయిల్ మద్దతుగా నినాదాలు చేశారు. పాలస్తీనా మద్దతుదారులను కాల్చివేయాలని బెదిరించారు. ఈ దాడిని ఇఫ్లూ స్టూడెంట్స్ యూనియన్ ఖండించింది. శాంతియుతంగా జరుగుతున్న నిరసన వద్దకు వచ్చి ఎబివిపి సభ్యులు పోస్టర్లను చింపివేశారని , పోలీసులు దుర్మార్గంగా ప్రవర్తించారని యూనియన్ నాయకులు తెలిపారు. విశ్వవిద్యాలయ యాజమాన్యం విద్యార్థులను రక్షించే ప్రయత్నం చేయలేదని వారు విమర్శించారు. ఒడిషాకు చెందిన 22 ఏళ్ల విద్యార్థిని ఎబివిపి గూండాలు చుట్టుముట్టి దాడి చేశారని, అతను ధరించిన పాలస్తీనా సాంప్రదాయ కండువాను చింపివేశారు విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు.

కాలిఫోర్నియాలో సెలవు దినంగా దీపావళి

సాక్రమెంటో : అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం దీపావళిని సెలవుదినంగా ప్రకటించింది. ఆ రాష్ట్ర గవర్నర్ గవిన్ న్యూసమ్ ఇందుకు సంబంధించిన బిల్లుపై సంతకం చేసారు. ఇప్పటికే పెన్సిల్వేనియా, న్యూయార్క్‌లు దీపావళిని సెలవు దినంగా గుర్తించాయి. దీంతో మూడవ రాష్ట్రంగా కాలిఫోర్నియా నిలిచింది. కాలిఫోర్నియా అత్యంత భారత సంతతి ఉన్న రాష్ట్రం. తాజా బిల్లుతో దీపావళి రోజున విద్యా సంస్థలకు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటిస్తారు.. దక్షిణ కాలిఫోర్నియాలోని సౌత్ ఏషియన్ నెట్‌వర్క్ బోర్డు ఛైర్మన్ రోహిత్ సేంద్రికర్ ఈ చట్టాన్ని దక్షిణాసియా సమాజం కాలిఫోర్నియాకు చేసిన కృషికి గుర్తింపుగా అభివర్ణించారు. " నా తల్లిదండ్రులు 1960లో ఇక్కడికి వచ్చినప్పుడు వారి వలస అనుభవం నాకు గుర్తుంది. నా తల్లిదండ్రులు , నా పిల్లలతో కలిసి ఇంట్లో దీపావళిని జరుపుకుంటాను, వారు ఇప్పుడు సంప్రదాయాలు, ఆచారాలను స్నేహితులతో పంచుకునే అవకాశం ఉంటుంది " అని తెలిపారు.

బిసి రిజర్వేషన్లపై విచారణ నేటికి వాయిదా

- తెలంగాణ హైకోర్టు నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నంబర్ తొమ్మిది సవాల్ చేస్తూ పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై బుధవారం హైకోర్టులో సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎకె సింగ్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం పిటిషన్లపై విచారణ చేపట్టింది. ఎస్‌సి, ఎస్‌టిల జనాభా లెక్కలు పరిగణనలోకి తీసుకోకుండా జనాభా దామాషా ప్రకారం బిసిల వారికి మాత్రమే ఏ విధంగా రిజర్వేషన్లు పెంచుతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని పిటిషనర్లు ప్రశ్నించారు. రిజర్వేషన్లు పెంచుకునే అధికారం ప్రభుత్వానికి ఉన్నా.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదనే నిబంధనలను ప్రభుత్వం అతిక్రమించిందనీ, బిసిలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లపై ప్రభుత్వం శాస్త్రీయ ఆధారాలు చూపలేదన్నారు. "బిసి కులగణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్లు అంటున్నారు. ఎస్సి,ఎస్టిల కుల గణన లెక్కలు మాత్రం ప్రభుత్వం వద్ద లేవు. ఎస్‌సి, ఎస్‌టిల జనాభాను లెక్కలోకి తీసుకోకుండా బిసి రిజర్వేషన్లు ఎలా అమలుచేస్తారు..? 2018లో అప్పటి ప్రభుత్వం బిసిలకు 34 శాతం బిసి రిజర్వేషన్లు కల్పిస్తే ఇదే కోర్టు కొట్టివేసింది. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికల నిర్వహణకు మేం వ్యతిరేకం కాదు. రాజ్యాంగ విరుద్ధంగా ఎలా నిర్వహిస్తారు?" అని పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. "బిసి రిజర్వేషన్ల బిల్లును అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. రాజకీయాలకు అతీతంగా మద్దతు లభించింది. జీవో నంబర్ 9పై స్టే ఇవ్వాలని కోరడం సరికాదు. ప్రజాసంక్షేమం కోసం నిర్ణయాలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. బిసి ప్రత్యేక (డెడికేటెడ్) కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచొచ్చు. శాసనవ్యవస్థ చేసిన చట్టాన్ని ఎవరూ ప్రశ్నించలేరు. సవరణ చేసినా, చట్టం చేసినా శాసనవ్యవస్థదే నిర్ణయం. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలైందని, ఎన్నికల ప్రక్రియలో కోర్టులు జోక్యం చేసుకోవద్దనే తీర్పులున్నాయి. ఈ సమయంలో ఎన్నికలపై స్టే ఇవ్వడం కూడా సరికాదు. సమగ్ర అధ్యయనం తర్వాతే బిసి బిల్లు చేశారు, జీవో తెచ్చారు. పూర్తి వాదనలు విన్న తర్వాతే జిఒ నెంబరు 9పై నిర్ణయం తీసుకోవాలి' అని వాదించారు. తదుపరి విచారణను సిజె ధర్మాసనం గురువారంకు వాయిదా వేసింది.

ప్రైవేటుకు తిరుపతి రైల్వే స్టేషన్

• దక్షిణ వైపు కొత్త భవనంపై

ఎయిర్ స్పేస్ లీజు కోసం ప్రీ-బిడ్ సమావేశం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి రైల్వే స్టేషన్ ప్రైవేటీకరణ వైపు అడుగులు వేస్తున్నారు. దక్షిణం వైపు కొత్త భవనం నిర్మాణం పనులు జరుగుతున్నాయి. అందులో కొన్ని అంతస్తులు ప్రైవేట్ పరం చేసేందుకు రైల్వే ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా బుధవారం కొత్త భవనం పై ఎయిర్ స్పేస్ లీజు కోసం ప్రీ బిడ్ సమావేశం నిర్వహించడం జరిగింది. తిరుపతి రైల్వే స్టేషన్‌కు ఏడాదికి సుమారు రూ. 170 కోట్ల రూపాయలు ఆదాయం వస్తుంది. ప్రతిరోజు 80 రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. ప్రయాణికులు రోజుకి 50 నుండి 60 వేల మంది ప్రయాణికులు ప్రయాణిస్తారు. ప్రస్తుతం సుమారు రూ. 400 కోట్ల రూపాయలతో రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చేస్తున్నారు. రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన స్వయంప్రతిపత్తి సంస్థ రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ, తిరుపతి రైల్వే స్టేషన్ కొత్త దక్షిణ వైపు భవనంపై ఉన్న 36,640 చ.మీ. ఎయిర్ స్పేస్ లీజు టెండర్ ప్రక్రియలో భాగంగా, ప్రీ-బిడ్ సమావేశాన్ని బుధవారం తిరుపతిలో నిర్వహించింది. కొత్త దక్షిణ వైపు స్టేషన్ భవనం 14 అంతస్తులతో రూపకల్పన చేయబడింది. అందులో పది అంతస్తులు వాణిజ్య అభివృద్ధి కోసం - రిటైల్ షాపులు, రెస్టారెంట్లు, హోటళ్లు మొదలైన వాటికి కేటాయించబడనున్నాయి. ఈ లీజు రెవెన్యూ షేర్ మోడల్ పద్ధతిలో అందించనున్నారు. ఈ సమావేశానికి అనేక రియల్ ఎస్టేట్ డెవలపర్లు, హాస్పిటాలిటీ రంగానికి చెందిన ప్రతినిధులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలలో హాజరయ్యారు.

పత్తికి విపత్తు

అధిక వర్షాలతో పంటను పీడిస్తున్న తెగుళ్లు
నేలపాలవుతున్న తెల్లబంగారం
నష్టాల బారిన రైతులు



ప్రజాశక్తి - సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

ఎన్నో ఆశలతో సాగు చేసుకున్న పత్తి పంట చేతికొచ్చే సమయానికి అధిక వర్షాలు నిండా ముంచేశాయి. అధిక తేమతో విజృంభిస్తున్న తెగుళ్లతో కష్టాలు నష్టాలతో రైతులు విల విల లాడుతున్నారు. చెట్లపైనే కాయలు కుళ్లిపోతున్నాయి. తీసేందుకు సిద్ధంగా ఉన్న తెల్ల బంగారం నేలపాలైంది. నేల పడిన విత్తనాలు మొలకెత్తి రంగు మారిపోవడంతో రైతు కుదేలవుతున్నారు. ఎకరాకు పది క్వింటాళ్లు నుంచి ఏడు క్వింటాళ్లు దిగుబడి తగ్గిపోతుందని రైతు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

సాలూరు నియోజకవర్గంలో ప్రధాన వాణిజ్య పంటలో ఒకటి పత్తి పంట. గత కొన్నిరోజులుగా ఏకధాటిగా ఈ ప్రాంతంలో కురుస్తున్న వర్షానికి పత్తి పంట మొగ్గ, కాయ దశలో ఉండడంతో ఈ వర్షానికి మొగ్గ, కాయలు నేలపాలవుతున్నాయి. దుక్కులు దున్ని పంటను వేసిన వాటికి ఎరువులు, కలుపు తీసుకొని నిరంతరం పంటను కాపాడుకోవడానికి రైతులు పడుతున్న కష్టం అంతా ఇంతా కాదు. ప్రస్తుతం పత్తి పంట మొగ్గ, కాయ దశలో ఉండడం ఈ వర్షాలకు అవి నేలపాలవుతున్నాయి. రైతు చూస్తుండగానే అవి పనికి రాకుండా పోవడంతో దుఃఖంతో చూడడమే తప్ప ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు. ఎకరానికి రూ.20 నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టి వాటిని చంటి పిల్లాడిలా చూసుకుని నిరంతరం వాటిలో కలుపు తీసుకొని ఎరువులను, మందులను పిచికారీ చేస్తూ ఎప్పటికప్పుడు వాటిని శుభ్రంగా చూసుకొని పంట చేతికి వచ్చి రూపాయి తిందామన్న సమయంలో ఇటువంటి పరిస్థితులు దాపురించడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా నిరంతరం అధిక వర్షాలు పడడంతో పంట చేలలో ముడుకులోతు నీళ్లు నిల్వ ఉండడంతో ఆ పంట పూర్తిగా పాడై ఎర్రబారిపోతుంది. దీంతో వర్షం తగ్గినా కూడా ఈ పంట పనికిరాకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో ఉండే పత్తి పంటలో నీళ్లు చేరకపోయినా ఈ అధిక వర్షాలతో మొగ్గ, కాయలు కింద పడి కుళ్లిపోతున్నాయని, దీని ద్వారా తెగుళ్లు కూడా అధికంగా వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరాకు పది క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉన్నా అకాల వర్షాలతో మూడు నుంచి నాలుగు క్వింటాలు కూడా రాదేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుళ్లిపోయిన కాయలను తెచ్చి ఆరబెట్టి వాటిని రంగు మారిన పత్తిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

రూ.212 కోట్లతో రాజ్‌భవన్

• సిఆర్‌డిఎ ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో 212 కోట్ల రూపాయల వ్యయంతో రాజ్‌భవన్ (గవర్నర్ నివాసం) నిర్మాణ ప్రతిపాదనకు రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఎ) ఆమోద ముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు అధ్యక్షతన బుధవారం సాయంత్రం జరిగిన సిఆర్‌డిఎ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కృష్ణా నది ఒడ్డున అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా రాజ్‌భవన్ నిర్మాణం జరగనుంది. దీనికి సంబంధించిన డిజైన్ అద్భుతంగా ఉండాలని సిఎం సూచించారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు తక్షణం రిటర్నబుల్ ప్లాట్లను ఇవ్వాలని ఈ సందర్భంగా అధికారులను ఆయన ఆదేశించారు. ఎక్కడ ప్లాట్లు ఇస్తామని చెప్పామో అక్కడే ఇవ్వాలని చెప్పారు.కాజా టోల్‌గేట్ దగ్గర రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని, కరకట్టను విస్తరించాలని అన్నారు. మూడు నెలల్లో రాజధాని నగరానికి ఒక రూపు తీసుకురావాలని చెప్పారు.

ఆక్వా సాగుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

• వారం రోజుల్లో చేసుకోకపోతే జరిమానా

ప్రజాశక్తి - భీమవరం

పశ్చిమగోదావరి జిల్లాలోని ఆక్వా చెరువుల సాగుదారులు తప్పనిసరిగా అప్సడ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ) కింద నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 50 వేల ఎకరాల ఆక్వా చెరువులను అప్సడ కింద నమోదు చేసుకున్నారని, ఇంకా సుమారు 83 వేల ఎకరాల వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. 'అప్సడ'లో రిజిస్టరైన వారు మాత్రమే విద్యుత్ సబ్సిడీ, ఇతర ప్రభుత్వ రాయితీలను పొందగలరని అన్నారు. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతికి కూడా అప్సడ లైసెన్స్ తప్పనిసరని తెలిపారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్లు ఒక నెలలోపు పూర్తి చేయాలని ఆదేశించారని, ఇప్పటికే 20 రోజులు గడువు ముగిసిందని చెప్పారు. అప్సడ రిజిస్ట్రేషన్ లేకుండా ఆక్వా ఉత్పత్తులు సాగు చేస్తే వారికి పెద్ద మొత్తంలో అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు. రానున్న వారం రోజుల్లోపు ఆక్వా రైతులు విధిగా అప్సడ రిజిస్ట్రేషన్లను పూర్తి చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకునే రైతు ఎకరానికి ఒక వెయ్యి రూపాయలు రుసుం చెల్లించాల్సి ఉంటుందని, ఎఫ్ఎంబి, పట్టాదారు పాస్‌బుక్, ఆర్ఓఆర్, అడంగల్, ఆధార్ కార్డ్, లైవ్ ఆటోకాడ్, లీజ్ హోల్డర్ అయితే లీజు అగ్రిమెంటును సంబంధిత సచివాలయాల్లో అందజేసి డిజిటల్ అసిస్టెంట్ ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అప్సడ రిజిస్ట్రేషన్‌ను వెంటనే పూర్తి చేసుకొని ప్రభుత్వ రాయితీలు పొందాలని సూచించారు.

పచ్చకామెర్లతో ఇద్దరు మృతి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

కురుపాం గురుకుల బాలికల పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు మాత్రమే పచ్చకామెర్లు లక్షణాలతో మరణించారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు చెప్పారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో ఇద్దరు పచ్చకామెర్లతో మృతి చెందినట్లు ప్రచారం జరుగుతోందని, అది అవాస్తవమని చెప్పారు. కురుపాం గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో 60మంది కోలుకున్నారని, మిగిలిన వారి ఆరోగ్యం కూడా నిలకడగా ఉందని డాక్టర్ భాస్కరరావు తెలిపారు.

నేటి నుంచి ఐద్వా చైతన్య సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుంచి నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం నుంచి కళా చైతన్య సాంస్కృతిక ప్రదర్శనలు అనంతపురంలో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రచార జాతాను బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ పల్లవి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా అధ్యక్షురాలు శ్యామల, జిల్లా కార్యదర్శి చంద్రిక మాట్లాడుతూ ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 13, 14, 15వ తేదీల్లో అనంతపురంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు కృష్ణ కళామందిరిలో మహిళల సమస్యలపై వివిధ రూపాల్లో ఉన్న ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

నల్లమాడ మండలం ఎర్రవంకపల్లి గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అత్యాచారం చేసిన పోక్సో కేసులో నిందితుడికి అనంతపురం పోక్సో స్పెషల్ కోర్టు 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5,000 జరిమానా, బాధితురాలికి రూ.4.50 లక్షల పరిహారం చెల్లించాలని బుధవారం తీర్పు ఇచ్చింది. 2020 సంవత్సరం డిసెంబర్ నెలలో నల్లమాడ మండలం ఎర్రవంకపల్లి గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలిక తన ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన బండి ఆదినారాయణ ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి జొరబడి అత్యాచారం చేశాడు. ఈ కేసులో నల్లమాడ పోలీస్ స్టేషన్ అధికారి కేసు నమోదు చేయగా అప్పటి కదిరి డీఎస్పీ విచారణ చేశారు. అనంతపురం జిల్లా పోక్సో కోర్టులో చార్జిషీటు వేయడం జరిగింది. ఈ కేసులో పూర్వాపరాలను పరిశీలించి సాక్షులను విచారించిన కోర్టు బండి ఆదినారాయణ నేరం చేశాడని నిర్ధారించింది. ఈ మేరకు బుధవారం తీర్పు ఇచ్చింది.

ఛత్తీస్‌గఢ్ పవర్‌ప్లాంట్‌లో ప్రమాదం

- లిఫ్ట్ కూలి నలుగురు మృతి, ఆరుగురికి గాయాలు

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గడ్‌లో శక్తి జిల్లాలోని పవర్‌ప్లాంట్‌లో లిఫ్ట్ కూలి నలుగురు కార్మికులు మృతి చెందగా, ఆరుగురికి గాయలయ్యాయి. గాయపడిన ఆరుగురిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని శక్తి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అంకిత శర్మ తెలిపారు. మంగళవారం రాత్రి ఉచ్పిండా గ్రామంలోని దబ్రా ప్రాంతంలోని ఆర్‌కెఎం పవర్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్లాంట్‌లో ప్రమాదం జరిగింది. పదిమంది లిఫ్ట్ ఎక్కగా, నలభై అడుగుల ఎత్తులో ఉన్నప్పుడు లిఫ్ట్ ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో గాయాలైన పది మందిని హుటాహుటిన రాయ్‌గఢ్ జిల్లాలోని జిందాల్ ఫోర్టిస్ ఆసుపత్రికి తరలించారు. వీరిలో నలుగురు బుధవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందారు. మిగతా ఆరుగురు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఆ లిఫ్ట్ సామర్థ్యం దాదాపు 2 వేల కేజీలు. దాని నిర్వహణ పనులు ఇటీవలే జరిగాయి. నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందా అనే కోణంలో విచారిస్తున్నట్లు ఎస్‌పి అంకిత శర్మ అన్నారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లో కేవలం పదిహేనురోజుల్లో ఇది రెండో ప్రమాదం. సెప్టెంబర్ 26న గోదావరి పవర్ అండ్ ఇస్పాత్ లిమిటెడ్ ఆవరణలో ఒక నిర్మాణ భవనం కూలి, ఆరుగురు మృతి చెందారు. అనేక మంది గాయాపడ్డారు.

ఆరు నెలల్లో సమగ్ర రోడ్డు భద్రతా నిబంధనలు

- రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : ఆరు మాసాల్లోగా సమగ్ర రోడ్డు భద్రతా నిబంధనలను రూపొందించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను సుప్రీం కోర్టు మంగళవారం ఆదేశించింది. పాదచారులకు రక్షణ హెల్మెట్ ధరించేలా చూడడం, తప్పు దారిలో డ్రైవింగ్, సురక్షితం కాని ఓవర్‌టేకింగ్, ఎల్‌ఇడి హెడ్‌లైట్లను వినియోగించడం, ఎరుపు, నీలం స్ట్రోబ్ లైట్లను అనధికారికంగా ఏర్పాటు చేయడం లేదా అమ్మడం వంటి అంశాలన్నింటిపైనా నిబంధనలు వెలువరించాలని కోరింది. ఎలాంటి ప్రాణ నష్టం లేదా అవయవాలు కోల్పోవడం వంటివి లేకుండా పాదచారుల రోడ్డు దాటే క్రాసింగ్‌లను సురక్షితంగా వుంచాల్సిన అవసరం చాలా వుందని పేర్కొంది. 2023లో రోడ్డు ప్రమాదాల్లో 35వేల మందికి పైగా పాదచారులు మరణించారని ప్రభుత్వ డేటా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసింది. హెల్మెట్లు ధరించకపోవడం వల్లనే 54వేల మందికి పైగా ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారని తెలిపింది.

1.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

(మొదటిపేజి తరువాయి)

ఆర్థిక రీజియన్‌ను, నెల్లూరు నుంచి సీమ జిల్లాలను కలుపుతూ మరో రీజియన్‌ను ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటకం, ఆతిథ్య రంగం వంటి రంగాల్లో పెట్టుబడులపైనా దృష్టి సారించాలన్నారు. కళా రంగాల్లో కూడా కూచిపూడి, థింసా వంటి సాంప్రదాయాలపై పలు కేంద్రాలను ఏర్పాటుచేయాలని సూచించారు.

వర్జీనియా తరహాలో విశాఖ

అమెరికాలోని వర్జీనియా డేటా వ్యాలీగా ఉందని రైడెన్, గూగుల్‌తో పాటు త్వరలో రానున్న టిసిఎస్‌లతో విశాఖ కూడా ఆ తరహా డేటా వ్యాలీగా మారుతుందని మంత్రి లోకేష్ వివరించారు. ఒక్క విశాఖలోనే ఐదు లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆయన వివరించారు. వచ్చే ఐటి సంస్థల ప్రాంతాల్లో నివాసం, రోడ్లు, ఇతర మౌళిక సౌకర్యాలపైనా దృష్టి సారించాలని చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, నారాయణ, టిజి భరత్, దుర్గేష్, బిసి జనార్దన్‌రెడ్డి, వాసంశెట్టి సుభాష్, అనగాని సత్యప్రసాద్‌లతోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి వైద్యుల సమస్యలు పరిష్కరించండి

(మొదటిపేజి తరువాయి)

నేపథ్యంలో ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న డాక్టర్లకు ఈ సీట్లు కేటాయింపు ప్రోత్సాహకంగా ఉంటుందని తెలిపారు. అదే విధంగా ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ఏజెన్సీ ఏరియాల్లో పనిచేస్తున్న వారికి ప్రత్యేక అలవెన్సు ఇవ్వాలని, 104లో పనిచేస్తున్న డాక్టర్లకు అదనపు అలవెన్సులు ఇవ్వాలని వారు కోరుతున్నట్లు వివరించారు. వారి ప్రతినిధులతో చర్చించి ఈ సమస్యలను పరిష్కరించాలని శ్రీనివాసరావు సిఎంకు విజ్ఞప్తి చేశారు.

వాయనాడ్ బాధితుల రుణాలను రద్దు చేయడంలో

కేంద్ర వైఖరి దురదృష్టకరం

- మోడీ ప్రభుత్వ తీరును తీవ్రంగా నిరసించిన కేరళ హైకోర్టు
- బ్యాంకుల బలవంతపు చర్యలను చూస్తూవూరుకోమని వ్యాఖ్య



తిరువనంతపురం : వాయనాడ్ వరద బాధితులు గతేడాది తీసుకున్న రుణాలను రద్దు చేయడానికి కేంద్ర ప్రభుత్వం విముఖతను వ్యక్తం చేయడాన్ని దురదృష్టకరమైనదిగా కేరళ హైకోర్టు అభివర్ణించింది. కేంద్రం, రాష్ట్ర ప్రజలను పూర్తిగా విఫలమయ్యేలా చేసిందని వ్యాఖ్యానించింది. బాధితులు తీసుకున్న రుణాల మొత్తాలను చెల్లించనవసరం లేకుండా రద్దు చేయాలంటూ సంబంధిత బ్యాంకులను ఆదేశించడానికి కేంద్రం తన విచక్షణను ఉపయోగించాలనుకోవడం లేదని కోర్టుకు స్పష్టంగా అర్థమైందని జస్టిస్ ఎ.కె.జయశంకరన్ నంబియార్, జస్టిస్ జోబిన్ సెబాస్టియన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది.

తనకు గల అధికారాన్ని వినియోగించడానికి తిరస్కరించడం ద్వారా కేంద్రం వాయనాడ్ కొండచరియల బాధితులను పూర్తిగా విఫలం చేసిందని కోర్టు వ్యాఖ్యానించింది. రుణాలను రికవరీ చేసుకునేందుకు సంబంధిత బ్యాంకులు పాల్పడే బలవంతపు పద్ధతులను చూస్తూ తాము మౌన ప్రేక్షకుల్లా వూరుకోలేమని పేర్కొంది.

రుణాల రద్దుపై కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌ను ప్రస్తావిస్తూ, ఇటువంటి పరిస్థితుల్లో తాము చర్య తీసుకునే అధికారం లేదంటూ కేంద్రం చేపట్టిన వైఖరిని తాము ఆమోదించలేమని కోర్టు తెలిపింది. పార్లమెంట్‌కు ఏ ఏ అంశాల్లో చట్టాలు చేసేందుకు అధికారం వుందో ఆయా అంశాలన్నింటిపై కేంద్ర కార్యనిర్వాహక వర్గానికి కూడా అధికారం వుంటుందని రాజ్యాంగంలోని 73వ అధికరణ స్పష్టం చేస్తోందని కోర్టు పేర్కొంది. అటువంటి విశేషాధికారాలు వున్నందున కేంద్రం బాధ్యతాయుతమైన రీతిలో స్పందించి బాధితుల జీవించే హక్కును పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాల్సి వుందని అభిప్రాయపడింది.

ఇతర రాష్ట్రాలకు సాయం

అదే సమయంలో గతేడాది ఇలాగే వరదలు, కొండచరియలు కూలిన విపత్తులను ఎదుర్కొన్న అస్సాం, గుజరాత్ రాష్ట్రాలకు అదనపు కేంద్ర సాయం ద్వారా రూ.707కోట్లను కేంద్రం ఆమోదించిన విషయాన్ని కోర్టు గుర్తు చేసింది. ఆ మొత్తంతో పోల్చుకుంటే వాయనాడ్ బాధితులు అడిగిన మొత్తం చాలా తక్కువ అని పేర్కొంది. ఇదంతా చూస్తుంటే వాయనాడ్ బాధితులను ఆదుకోరాదన్నది కేంద్రం వైఖరిగా వుందని స్పష్టమవుతోందని పేర్కొంది. రాజ్యాంగంలోని సమాఖ్య సూత్రాల ప్రకారం ప్రత్యేకంగా ఒక రాష్ట్రానికి చెందిన ప్రజల పట్ల కేంద్రం ఇలా పక్షపాత ధోరణి ప్రదర్శించరాదని కోర్టు వ్యాఖ్యానించింది. పార్టీ రాజకీయాలనేవి ప్రజాస్వామ్యంలోని ప్రజల ప్రాథమిక హక్కులను తోసిపుచ్చరాదని పేర్కొంది.

బ్యాంకులకు ఆదేశాలు జారీ

ఈ నేపథ్యంలో బాధితులకు రుణాలు ఇచ్చిన వివిధ బ్యాంకులకు పలు ఆదేశాలు జారీ చేసింది. రికవరీ చర్యలు తీసుకోకుండా ఆపాలంటూ ఆదేశించింది. ఈ రిట్ పిటిషన్ తుది పరిష్కారమయ్యేంతవరకు బాధితులపై ఎలాంటి చర్యలు చేపట్టరాదంటూ బ్యాంకులకు సూచించింది. కాగా, ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం ప్రకృతి విపత్తులు సంభవించిన ప్రాంతాల్లో బాధితులు తీసుకున్న రుణాల రద్దుకు ఎలాంటి నిబంధనల్లేవని కేంద్రం అఫిడవిట్ సమర్పించింది. పైగా ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగ పాలనాధికారాల పరిధిలో కూడా ఈ నిర్ణయం లేదని పేర్కొంది.

పర్యావరణ అనుమతులకు పాతర

- అదానీ కోసం నిబంధనలు సులభతరం చేసిన కేంద్రం
- అంబుజా సిమెంట్ ప్లాంట్‌పై నిరసనల నేపథ్యంలో నిర్ణయం

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం విధానపరమైన ఓ ప్రధాన మార్పును ప్రకటించింది. సొంత కాప్టివ్ ప్లాంట్లు లేని సిమెంట్ గ్రైండింగ్ యూనిట్లకు ముందస్తు పర్యావరణ అనుమతులు అవసరం లేదని తెలిపింది. ఈ సవరణకు సంబంధించి కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. ముంబయిలోని కల్యాణ్‌లో అదానీ గ్రూప్ సిమెంట్ ఉత్పత్తిని ప్రారంభించాలని యోచిస్తున్న విషయం తెలిసిందే. అయితే దీనిపై ప్రజల నుంచి తీవ్రమైన నిరసన వ్యక్తమవుతోంది. గతంలో అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఇలాంటి ప్లాంట్లు ప్రారంభించాలంటే ప్రజలను సంప్రదించాల్సి ఉంటుంది. సవివరమైన పర్యావరణ ప్రభావ నివేదికను కూడా సమర్పించాలి. కొత్తగా అమలులోకి వచ్చే నిబంధనల ప్రకారం ఇవేవీ అవసరం లేదు. ప్లాంటుపై సూచనలు, సలహాలు, అభ్యంతరాలు తెలపడానికి 60 రోజుల సమయం ఉంటుంది.

అదానీ గ్రూపునకు అనుబంధ సంస్థ అయిన అంబుజా సిమెంట్స్ రూ.1,400 కోట్ల పెట్టుబడితో ఆరు సిమెంట్ గ్రైండింగ్ యూనిట్లు నెలకొల్పాలని యోచిస్తోంది. అయితే పర్యావరణం, ఆరోగ్యంపై అవి చూపే తీవ్ర ప్రభావం గురించి ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనాభా ఎక్కువగా ఉండే కల్యాణ్‌లో ఈ ప్రభావం మరింత అధికంగా ఉంటుందని వారు చెప్పారు. ఈ యూనిట్ల నుంచి వెలువడే సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్స్, కార్బన్ మోనోక్సైడ్ వంటి కాలుష్య ఉద్గారాల ప్రభావం వారిని కలవరపెడుతోంది. సమీపంలోని పదికి పైగా గ్రామాల ప్రజలు తమ ఆందోళనలను కొనసాగిస్తున్నారు. సంతకాల సేకరణ కూడా జరుపుతున్నారు.

జోథ్‌పూర్ జైల్లో వాంగ్‌చుక్‌ను పరామర్శించిన గీతాంజలి

న్యూఢిల్లీ : ప్రస్తుతం జోథ్‌పూర్ జైల్లో ఉన్న లడఖ్ ప్రజా ఉద్యమకారుడు వాంగ్‌చుక్‌ను ఆయన భార్య గీతాంజలి ఆంగ్మో పరామర్శించారు. ఈ విషయాన్ని గీతాంజలి తన సోషల్‌మీడియా ఖాతా ద్వారా స్వయంగా బుధవారం వెల్లడించారు. న్యాయవాది రితం ఖరేతో కలిసి వాంగ్‌చుక్‌ను పరామర్శించినట్లు తెలిపారు. 'అతని స్ఫూర్తి ధైర్యం కలిగిస్తుంది. అతని నిబద్ధత దృఢ నిశ్చయం. అతని ధైర్యం చెక్కుచెదరకుండా ఉంది. మద్దతు, సంఘీభావం ప్రకటిస్తున్న అందరికీ వాంగ్‌చుక్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు' అని ఆంగ్మో తన పోస్టులో తెలిపారు. తన భర్తను విడుదల చేయాలని ఆంగ్మో సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ విచారణను ఈ నెల 14కు సుప్రీంకోర్టు వాయిదా వేసింది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా లడఖ్‌లో ఆందోళనల తరువాత వాంగ్‌చుక్‌ను జాతీయ భద్రతా చట్టం కింద ఆదుపులోకి తీసుకున్నారు. ముందుగా వాంగ్‌చుక్‌ను ఢిల్లీకి తరలించారు. తరువాత సెప్టెంబరు 26 నుంచి జోథ్‌పూర్ జైల్లో వాంగ్‌చుక్‌ను నిర్బంధించారు.

కైరో చర్చలకు ఖతార్ ప్రధాని

- మూడో రోజూ కొనసాగుతున్న చర్చలు
- గాజాలో తాజా దాడుల్లో 8మంది మృతి
- ఇజ్రాయిల్ ప్రధాన అడ్డంకిగా వుందన్న టర్కీ అధ్యక్షుడు



గాజా, కైరో : కాల్పుల విరమణ ఒప్పందం లక్ష్యంగా ఒకపక్క కైరోలో గత మూడు రోజులుగా చర్చలు జరుగుతున్నా ఇజ్రాయిల్ దాడులు మాత్రం ఆపడం లేదు. గత 24గంటల్లో జరిగిన తాజా దాడుల్లో 8మంది పాలస్తీనియన్లు మరణించగా, 61మంది గాయపడ్డారు. దీంతో ముందుగా ఇజ్రాయిల్‌ను కట్టడి చేయాలని హమాస్ పట్టుబడుతోంది. ఇజ్రాయిల్ దాడులు ఆగిన తరువాతే బందీలను విడుదల చేస్తామని హమాస్ స్పష్టం చేసింది. అలాగే బందీలను విడుదల చేయడానికి ముందు విడుదల చేయాల్సిన తమవారి జాబితాను హమాస్ సమర్పించింది. గాజా చర్చలకు ఖతార్ ప్రధాని, టర్కీ, ఈజిప్ట్ గూఢచర్య చీఫ్‌లు రావడాన్ని హమాస్ స్వాగతించింది. హమాస్ పొలిటికల్ బ్యూరో సభ్యుడైన ఇజ్జత్ అల్ రిషెక్ ఈ పరిణామంపై స్పందిస్తూ, వారి రాకతో ఈ చర్చలకు బలమైన ఊపు, ఉత్సాహం వచ్చిందని వ్యాఖ్యానించారు. కాల్పుల విరమణ ఒప్పందం, ఖైదీల మార్పిడి ఒప్పందం దిశగా సానుకూల ఫలితాలు సాధించడానికి వారి రాక ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నేతల రాకతో చర్చలను పక్కదారి పట్టించడానికి నెతాన్యహు చేసే విన్యాసాలకు అడ్డుకట్ట వేయగలుగుతామని అన్నారు. గాజా శాంతి ప్రణాళికపై చర్చలంటూనే ఇజ్రాయిల్ ట్రంప్‌ను లెక్కచేయటం లేదు. ముందుగా ఇజ్రాయిల్‌ను కట్టడి చేయాలని హమాస్ డిమాండ్ చేస్తోంది. అంతవరకూ తమ అదుపులో ఉన్న బందీలను విడుదల చేయబోమని కరాఖండిగా చెబుతోంది. దీంతో శాంతి ప్రణాళిక అనిశ్చితంగానే ఉండటంతో.. ట్రంప్ ఇప్పుడు టర్కీ సహాయం కోరుతున్నారు. గాజా శాంతి ప్రణాళిక విషయంలో అమెరికా అధ్యక్షుడు తనను సహాయం కోరారని టర్కీ అధ్యక్షుడు రెసెప్ ఎర్డోగన్ అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా ఈ శాంతి ప్రణాళికను అంగీకరించేలా హమాస్‌ను ఒప్పించాలని ట్రంప్ కోరుకుంటున్నారు. తాను ఇప్పటికే హమాస్‌తో సంప్రదింపులు జరుపుతున్నానని ఆయన పేర్కొన్నారు. ఇందులో పాల్గొన్న అన్ని పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నానని ఆయన పేర్కొన్నారు. పాలస్తీనా ప్రజలకు ఏది ఉత్తమమైన విధానం, ఏది సరైనదో వారికి వివరించే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. ఈజిప్టులో ఇజ్రాయిల్-హమాస్ చర్చల సందర్భంగా టర్కిష్ ఇంటెలిజెన్స్ చీఫ్ ఇబ్రహీం కాలిన్ కూడా ఉన్నారని గమనించాలి. అంతకుముందు, ట్రంప్ ప్రణాళికకు సంబంధించి ఈజిప్టులో జరుగుతున్న చర్చల పట్ల హమాస్ ఆశావాదంగా ఉందని పేర్కొంది. ఈ స్వాప్ ఒప్పందం కింద విడుదల చేయాల్సిన ఇజ్రాయిల్ బందీలు, పాలస్తీనా ఖైదీల జాబితాను కూడా హమాస్ సమర్పించింది.

అయితే, హమాస్ దీనికి కొన్ని షరతులు విధించింది. వాటిని పాటించకుండా ఒప్పందం సాధ్యం కాదని సంస్థ స్పష్టం చేసింది. ఈజిప్టులోని షర్మ్ ఎల్-షేక్‌లో ఇజ్రాయిల్, హమాస్ మధ్య పరోక్ష చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చలు ట్రంప్ 20-పాయింట్ల ప్రణాళికపై ఆధారపడి ఉన్నాయి.

ఇజ్రాయిల్ రెండేళ్లకు పైగా చేస్తున్న దాడులు గాజాను శిథిలావస్థకు చేర్చాయి. ఈ దాడుల్లో 67,000 మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. ఈ యుద్ధం గాజాను 69 సంవత్సరాలు వెనక్కి నెట్టిందని ఐక్యరాజ్యసమితి ఓ నివేదికలో అంచనా వేసింది. ఐక్యరాజ్యసమితి ప్రకారం.. గాజా నుంచి శిథిలాలను తొలగించడానికే 21 ఏళ్లు పడుతుందని అంచనా.

ఇజ్రాయిల్ ప్రధాన అడ్డంకి : టర్కీ అధ్యక్షుడు

గాజాలో శాంతి స్థాపన దిశగా సాగే ఈ చర్చలకు ఇజ్రాయిల్ ప్రధాన అడ్డంకిగా వుందని టర్కీ అధ్యక్షుడు రెసెప్ తైయిప్ ఎర్డొగన్ వ్యాఖ్యానించారు. టర్కీ పాలక పార్టీ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "శాంతి కపోతం ఒకే రెక్క వున్న పక్షి కాదు, హమాస్, పాలస్తీనియన్లపైనే మొత్తంగా శాంతి స్థాపన భారమంతా పెట్టడం సరైనది కాదు, వాస్తవిక ధోరణి కూడా కాదని వ్యాఖ్యానించారు. చర్చలు జరుగుతున్నప్పుడు గాజాలో దాడులు ఆపేయాలని మరోసారి కోరారు.

ఈజిప్ట్ అధ్యక్షుడి ఆశాభావం

గాజా చర్చల పట్ల ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతాహ్ అల్ సిసి ఆశాభావం వ్యక్తం చేశారు. మధ్యవర్తుల ద్వారా జరుగుతున్న చర్చలు అత్యంత ప్రోత్సాహకరంగా వున్నాయని సంకేతాలు అందుతున్నాయన్నారు. కతార్, ఈజిప్ట్ ప్రతినిధి బృందాలు, అధ్యక్షుడి ట్రంప్ దూతలు అందరూ అక్కడ నుండి పంపుతున్న సందేశాలు చూస్తుంటే సానుకూలత వుందని వెల్లడవుతోందన్నారు.

ఫ్లోటిల్లా కార్యకర్తలను విడిచిపెట్టండి

ఇంకా ఇజ్రాయిల్ చెరలో బందీలుగా వున్న గ్లోబల్ సుముద్ ఫ్లోటిల్లా కార్యకర్తలందరినీ విడిచిపెట్టాల్సిందిగా యురోపియన్ పార్లమెంట్, బ్రిటన్, టర్కీ, పలు యూరప్ దేశాలకు చెందిన పార్లమెంట్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు. ఇజ్రాయిల్ చర్య అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించేదిగా వుందని విమర్శించారు. వెంటనే వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని, వారికి అవసరమైన వైద్య, లీగల్ సాయాన్ని అందచేయాలని ఆయా ప్రభుత్వాలను కోరారు.

అదాని సిమెంట్‌పై జనాగ్రహం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో, గాజువాక

పెదగంట్యాడ ప్రాంతంలో 20 ఎకరాల్లో జనావాసాల నడుమఏర్పాటు చేయతలపెట్టిన అదాని సిమెంట్ ఫ్యాక్టరీపై స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఫ్యాక్టరీ నుండి వచ్చే కాలుష్యం తమ జీవితాలను కాటేస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, వీటిని ఏమాత్రం పట్టించుకోని ప్రభుత్వం బుధవారం ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేసింది. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సహ పలువురు అధికారులు వస్తుండటంతో పోలీసులు పెద్ద ఎత్తున మొహరించారు. ఈ విషయం తెలియడంతో స్థానిక ప్రజలు తీవ్ర స్థాయిలో స్పందించారు. నడుపూరు, బర్మా కాలనీ, హెచ్‌బి కాలనీ, నెల్లిముక్కు, పెదగంట్యాడ, బాలచెరువు, అయ్యన్నపాలెం, గంగవరం, మల్కాపురం తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజాభిప్రాయ సేకరణ ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. కొద్దిరోజులుగా ఫ్యాక్టరీ ప్రభావాలపై స్థానికంగా ప్రజలను చైతన్యపరుస్తున్న సిపిఎంతో పాటు వివిధ ప్రజా సంఘాలు, కాలనీ అసోసియేషన్ల నేతలు కూడా కదలివచ్చారు. ఆగ్రహంతో కదలివచ్చిన ప్రజలు పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసేసి, వేదికపైకి చేరుకున్నారు. టెంట్లను, కుర్చీలను విసిరేశారు. పబ్లిక్ హియరింగ్ జరగకుండా అడ్డుకున్నారు. దీంతో ఈ ప్రాంతంలో తీవ్ర స్థాయిలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే పది లక్షలమంది ప్రజానీకం అనారోగ్యాల పాలవుతారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ జరపడానికి వీల్లేదని అధికార యంత్రాంగాన్ని వెంబడించి మరీ నినాదాలు చేశారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రజాభిప్రాయ సేకరణ ప్రదేశానికి రాకుండా దూరం నుంచే పరిస్థితిని గమనించి వెనుతిరిగారు. ఆర్‌డిఒ శ్రీలేఖ వచ్చినప్పటికీ మహిళలంతా పెద్ద సంఖ్యలో ఆమెతో వాగ్వాదానికి దిగారు. మేం వద్దంటే ఎలా కాలుష్య ఫ్యాక్టరీ పెడతారని, 'గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. ఆమె వివరాలు అడిగి తెలుసుకుని అక్కడ నుంచి వెనుతిరిగారు. ప్రజానీకం కదలికలపై ఎప్పటికప్పుడు పోలీసులు రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయానికి వివరాలు అందజేశారు.



ప్రజాభిప్రాయ వేదిక వద్దకు గేట్లను తోసుకుంటూ వెళ్తున్న ప్రజానీకం

ఫ్యాక్టరీ వద్దు : జగ్గునాయుడు

ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు ప్రజాగ్రహాన్ని గుర్తించిలని, ఫ్యాక్టరీని ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు, ఆరోగ్యాలకు ప్రమాదం వాటిల్లే నిర్ణయాలు చేయవద్దని అన్నారు.

సాయంత్రం మరోసారి

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు అడ్డగించడంతో అధికారులు వెనుదిరిగారు. ప్రజలూ వారి ఇళ్లకు వారు వెళ్లారు. అయితే, సాయంత్రం నాలుగు గంటలకు నగర పోలీస్ కమిషనర్, జాయింట్ కలెక్టర్ మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ కోసం సిద్ధమయ్యారు. న్యూ పోర్ట్ పోలీస్ స్టేషన్, పెదగంట్యాడ తహశీల్దార్ కార్యాలయంలో ఉండి సమాలోచనలు చేశారు. పెదగంట్యాడ ప్రాంతంలోని రహదారులపై పోలీసులు మోహరించారు. ఫ్యాక్టరీ వ్యతిరేక ఆందోళనలో పాల్గొంటున్న 15 మందిని అరెస్టు చేసి స్టీల్‌ప్లాంట్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. నడుపూరు హైస్కూల్ వద్ద తాత్కాలిక టెంట్ వేశారు. ఆరు గంటల వరకు ఏదో ఒక విధంగా పబ్లిక్ హియరింగ్ జరపాలని ప్రయత్నాలు చేశారు. మరింత ముందుకెళ్తే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని, పరిస్థితులు మరింతగా దిగజారే ప్రమాదం ఉందంటూ అందిన సమాచారంతో ప్రజాభిప్రాయ సేకరణను రెండు వారాలపాటు వాయిదా వేస్తున్నట్టు జెసి ప్రకటించారు.

రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

- మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధిపరిచినందుకు అవార్డు

స్టాక్‌హోం : రసాయన శాస్త్రంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్ బహుమతి లభించింది. మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ (లోహ-సేంద్రీయ చట్రాలు)ను అభివృద్ధిపరిచినందుకు సుసుము కిటగవా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ ఎం.యాగిలకు ఈ పురస్కారాన్ని ప్రకటించారు. ఈ మేరకు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. వాయువులు, ఇతర రసాయనాలు ప్రవహించగల పెద్ద ఖాళీలతో కూడిన కొత్త రకానికి చెందిన మాలిక్యులార్ కనస్ట్రక్షన్స్ (పరమాణు నిర్మాణాలను) ను వీరు అభివృద్ధిపరిచారని నోబెల్ అకాడమీ పేర్కొంది. మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్‌గా పిలిచే ఈ నిర్మాణాలను ఎడారి గాలి నుండి నీటిని సేకరించేందుకు ఉపయోగించవచ్చు, అలాగే విషపూరితమైన వాయువులను నిల్వ వుంచడానికి లేదా రసాయన ప్రతిచర్యలను ఉత్ప్రేరకపరచడానికి కూడా ఉపయోగపడతాయి. 1989లో రిచర్డ్ రాబ్సన్ అణువుల యొక్క అంతర్గత లక్షణాలను వినూత్న మార్గంలో ఉపయోగించడాన్ని పరీక్షించాడు. అయితే ఆ మాలిక్యులార్ కనస్ట్రక్షన్ అస్థిరంగా వుండి సులభంగా విడిపోతోంది. అయితే ఆ తర్వాత సుసుము కిటగవా, ఒమర్ యాగిలు ఈ పద్ధతికో ఒక ధృఢమైన పునాది వేశారు. ఆ నిర్మాణాల గుండా వాయువులు లోపలకు, బయటకు ప్రవహించగలవని కిటగవా రుజువు చేశారు. దానికి అవసరమైన కొత్త లక్షణాలను అందచేయడం ద్వారా ఆ ఫ్రేమ్‌వర్క్‌ను చాలా స్థిరంగా, ధృడంగా వుండేలా యాగి రూపొందించారు.

కోనసీమలో ఘోరం!

(మొదటిపేజి తరువాయి)

కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఆరుగురు సజీవ దహనమయ్యారు. వీరిలో ఫైర్ వర్క్స్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి, కూలీలు రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన పాకా అరుణ (35), అనపర్తికి చెందిన చిట్టూరి శ్యామల (35), అనపర్తి సావరం గ్రామానికి చెందిన కుడిపూడి జ్యోతి (38), పెంకే శేషారత్నం (40) మృతదేహాలను గుర్తించారు. మరొకరిని గుర్తించాల్సి ఉంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొమరిపాలేనికి చెందిన పొట్నూరి వెంకటరమణ, పెదపూడి మండలం వేంద్ర గ్రామానికి చెందిన లింగం వెంకటకృష్ణ, అనపర్తికి చెందిన చిట్టూరి యామిని, సోమేశ్వరానికి చెందిన వాసంశెట్టి విజయలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముగ్గురు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో, ఒకరు ట్రస్ట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందని తెలిపారు. గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం అందించాలని జిల్లా యంత్రాంగాన్ని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదేశించారు. అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. ప్రమాదానికి కారణాలు, ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యలు, క్షతగాత్రులకు వైద్యసాయం తదితర విషయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పేలుడులో పలువురు మృతి చెందడం బాధాకరమని జగన్ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలను ఉదారంగా ఆదుకోవాలని కోరారు.

ఘటనా స్థలాన్ని సందర్శించిన హోం మంత్రి అనిత

ఘటనా ప్రాంతాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత బుధవారం రాత్రి సందర్శించారు. కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్‌పి రాహుల్ మీనాలతో ఆమె మాట్లాడారు. ప్రమాదానికి కారణాలపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన వారిలో ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్‌పి రాహుల్ మీనా ఉన్నారు.

ప్రమాదానికి కారణాలు తెలుసుకుంటున్నాం : కలెక్టర్

ఈ ఘటనపై కలెక్టర్ స్పందించారు. వారం క్రితమే బాణసంచా తయారీ కేంద్రాన్ని స్థానిక పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పరిశీలించి అన్ని రక్షణ చర్యలూ ఉన్నట్లు నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. అగ్నిప్రమాదం నివారణ పరికరాలను గోదాము యజమానులు సక్రమంగా వినియోగించారా? లేదా? అనే విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రమాదానికి కారణాలు తెలుసుకుంటున్నామన్నారు.

అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఇటువంటి ప్రమాదాలు : వి.శ్రీనివాసరావు

బాణసంచా ప్రమాదంలో పలువురు మరణించడం పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు రాష్ట్ర కమిటీ తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం ప్రభుత్వమే అందించాలని కోరారు. దీపావళి బాణసంచా తయారీ కేంద్రాల్లో తగు రక్షణ చర్యలు లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

'అనంత'పై కార్పొరేట్ పడగ

(మొదటిపేజి తరువాయి)

20 వేల ఎకరాల భూములను ప్రభుత్వం రైతుల నుంచి, సాగుదార్ల నుంచి లాక్కొంది. అప్పట్లో తక్కువ మొత్తంలో పరిహారం ఇచ్చింది. ఈ భూముల్లో ప్రస్తుతం 12 వేల ఎకరాల వరకూ ఖాళీగా ఉన్నాయి. తిలమత్తూరు మండలం కొండికొండ వద్ద 2009లో అప్పటి ప్రభుత్వం 8,484 ఎకరాల భూమిని బెంగళూరు విమానాశ్రయానికి అతి సమీపంలో బలవంతంగా సేకరించింది. వీటిని లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు కట్టబెట్టింది. ఈ సంస్థ ఇక్కడ ఒక్క పరిశ్రమను కూడా ఏర్పాటు చేయలేదు. పైగా, ఈ భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి రూ.700 కోట్లు రుణం తీసుకుంది. ఈ భూముల విలువ ప్రస్తుతం దాదాపు రూ.20 వేల కోట్లపైనే ఉంటుందని అంచనా. మడకశిర ప్రాంతంలో రెండు వేల ఎకరాలు, కంబదూరు మండలం తిమ్మసముద్రంలో వెయ్యి ఎకరాలు, ఆమడగూరులో 400 ఎకరాలు ప్రభుత్వం బలవంతంగా తీసుకుంది. ఈ భూములన్నీ ప్రస్తుతం ఖాళీగానే ఉన్నాయి. ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదు. ఇవి కాకుండా వేర్వేరు ప్రాంతాల్లోనూ పరిశ్రమల పేరుతో భూములను ప్రభుత్వం సేకరించింది. వీటిలో కూడా చాలావరకు భూములు ఖాళీగానే ఉన్నాయి. పెనుకొండ సమీపంలో సేకరించిన రెండు వేల ఎకరాల్లో కియా, దాని అనుబంధ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వీటిలో స్థానికులకు కొందరికి కింది స్థాయి ఉద్యోగాలు మాత్రమే లభించాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాధారంగా ప్రధానంగా వేరుశనగ సాగు చేస్తున్నారు. ఏకరాకు 480 కిలోల దిగుబడి వస్తోంది. బోర్ల కింద అక్కడక్కడా వరి చేస్తున్నారు. పరిశ్రమల పేరుతో తీసుకున్న సాగు భూములు వృథాగా ఉండడంతో ఆ మేరకు పంటలను ఏటా కోల్పోవాల్సి వస్తోంది.

మోడీ ప్రభుత్వ పతనం ప్రారంభం

(మొదటిపేజి తరువాయి)

కమిషన్ మౌనం వహించింది. ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడుతున్న జట్లలో ఒక దానిలో రిఫరీ చేరిపోయినట్లు బీహార్‌లో పరిస్థితి ఉంది. చట్ట ప్రకారం ఎన్నికల కమిషన్ తటస్థంగా ఉండాలి. కానీ ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. ఏదేమైనా ఈ పరిస్థితిని అధిగమించాలని బీహార్ ప్రజలు కృతనిశ్చయంతో ఉన్నారు.

ప్ర : గత ఎన్నికల్లో సిపిఎం బీహార్‌లో నాలుగు స్థానాలకు పోటీ చేసి రెండింటిని గెలుచుకుంది. ఈసారి ఎన్ని సీట్లలో పోటీ చేస్తున్నారు.

జ : గతం కంటే ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలన్నది మా రాష్ట్ర కమిటీ అభిప్రాయం. దీనిపై చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుత సమయంలో ఇంతకు మించి వివరాలు చెప్పలేను.

ప్ర : ఆమ్ ఆద్మీ పార్టీ 11 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఇది బిజెపికి అనుకూలించే చర్య కదా! వారు ఇండియా ఫోరమ్‌లో చేరే అవకాశాలు ఉన్నాయా?

జ: ఆమ్ ఆద్మీ పార్టీని స్వతంత్రంగా పోటీ చేయకుండా మేము అడ్డుకోలేము. కానీ నా సలహా వారి పోటీ ఎక్కడైనా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు ప్రయోజనం కలిగించేలా ఉంటే అక్కడి ఎన్నికల్లో వారు పాల్గొనకూడదు.

ప్ర : 'సర్'ను అమలు చేసిన తర్వాత కొన్ని జిల్లాల్లో ఓటర్ల జాబితాల నుంచి 5-12 శాతం మందిని తొలగించారు. కొన్నిచోట్ల కొత్తగా ఓటర్లను చేర్చారు. దీనిమీద మీ పరిశీలన ఏమైనా ఉందా?

జ : ఓటు వేయాలని అనుకునే ప్రతి ఒక్కరికీ ఆ అవకాశం కల్పించాల్సిందే. ఆ బాధ్యత ఎన్నికల కమిషన్‌ది. కానీ ఓటర్ల జాబితాల నుంచి తొలగింపుల పైనే అది దృష్టి సారించినట్లు కన్పిస్తోంది. బ్యాలెట్ అవకాశాలను పరిమితం చేస్తోంది. ఈ ప్రాథమిక హక్కు కోసం బీహార్ పోరాడుతోంది. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పౌరుడికీ ఓటు హక్కు కల్పించేలా మా పోరాటాన్ని కొనసాగిస్తాం.

ప్ర: ఇండియా బ్లాక్‌లో సీట్ల కేటాయింపుపై చర్చల్లో జాప్యం జరుగుతున్నట్లు కన్పిస్తోంది. ఎందుకని?

జ : కొన్ని కొత్త పార్టీలను చేర్చుకోవడం వల్ల జాప్యం జరుగుతోంది. సీట్ల పంపిణీలో ఆ పార్టీలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రధాన పార్టీ చర్చలు మొదలు పెట్టింది. కలిసికట్టుగానే ఒప్పందం జరుగుతుంది. నితీష్ పాలనకు ముగింపు పలకడమే మా లక్ష్యం.

ప్ర : ఎన్నికలకు కేరళ సిద్ధమవుతోంది. ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి?

జ : వరుసగా ఎల్‌డిఎఫ్ మూడోసారి హ్యాట్రిక్ సాధించి అధికారంలోకి వస్తుంది. ఎల్‌డిఎఫ్ ఇమేజ్‌ను దెబ్బతీయడానికి గతంలో ప్రతిపక్షాలు చేసిన ప్రయత్నాలు ప్రభుత్వ విశ్వసనీయతపై ప్రభావం చూపలేకపోయాయి. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా చేపట్టిన చర్యలకు విశేష మద్దతు లభిస్తోంది. కొనసాగుతుంది.

జీవన సౌరభం

ఇతరుల తప్పులను ఎంచేవారు, తమలోని లోపాలను గుర్తించలేరు.

మీకోసం

పొడిబారిన పెదవులపై కొబ్బరినూనె, బాదం నూనెను సమపాళ్లలో కలిపి రాసుకుంటే మృదువుగా ఉంటాయి.



పరీక్షలు




హాయ్ ఫ్రెండ్స్,

నా పేరు కుందనిక, 8వ తరగతి చదువుతున్నాను. దసరాకి ముందు మా స్కూల్లో అన్ని తరగతుల వారికి పరీక్షలు నిర్వహించారు. పరీక్ష రోజు పాఠశాల మొత్తం నిశ్శబ్దంగా, వాడిపోయిన ముఖాలతో కనిపించింది. పరీక్షల రోజు కొంతమంది ప్రశాంతంగా ఉంటే, కొంతమంది చివరి నిమిషంలో రెండు నెలల పాఠ్యాంశాలు చదివేయాలని తొందర పడుతూ కనిపించారు. పేపర్ ఇవ్వగానే కొంతమంది ముఖాలు వెలిగిపోయాయి. కొంతమందివి వాడిపోయాయి. కొంతమంది ముఖ చిత్రాలు చూస్తే యుద్ధంలో ఓడిపోయినట్లు కనిపించాయి. మరి కొంతమంది ముఖచిత్రాలు బాగా రాయవచ్చు అన్న నమ్మకంతో ఉంటాయి. నేను మాత్రం అన్ని పరీక్షలు బాగా రాశాను ఫ్రెండ్స్.



- ఆర్. కుందనిక,
8వ తరగతి, అరవింద హై స్కూల్, కుంచనపల్లి.

టీను గుర్రం



చక చక గుర్రం
చలాకి గుర్రం
చంటి పిల్లల గుర్రం
చక్కని చూపుల గుర్రం!

తక తై తక తై
తాత వీపే మొదటి గుర్రం
బిలి బిలి పాప గుర్రం
జీను లేని జిల్ జిల్ గుర్రం!

విరాజు విహరించే గుర్రం
విరామ మెరుగని గుర్రం
విమల విశ్వాస గుర్రం
వినుతికెక్కిన వీర గుర్రం!


టింగు రంగుల టీను గుర్రం
తిరునాళ్ల ఆడే కొయ్య గుర్రం
ఆకలి దప్పు లేరుగని గుర్రం
ఆట పాటల్లో ఆడే గుర్రం!


పిల్లల ఊహల రెక్కల గుర్రం
కీ ఇస్తే దౌడు తీసే గుర్రం
లగాము లేని గుర్రం
లడాయి జేయ లగేత్తె గుర్రం!

- పట్లోళ్ల బక్కారెడ్డి,
97053 15250.

నేను గీసిన బొమ్మ







బి శరణ్య రంగవల్లిక,
3వ తరగతి, ఎం.పి..పి.ఎస్ టి టెంపుల్, విస్సన్నపేట, ఎన్టీఆర్ జిల్లా.



ఎస్‌కె.సోహెల్,
6వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్ ముక్కామల,
తిరువూరు మండలం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సంకల్పం ముందు సమస్య చిన్నదే..

'సంకల్పం గట్టిగా ఉండాలే గానీ, అసాధ్యాలను సైతం సుసాధ్యం చేయొచ్చు' అని ఎంతోమంది నిరూపించారు. గుజరాత్‌కి చెందిన హిమాన్షి రాథి వారిలో ఒకరు. పుట్టుకతో అంధురాలు కాకపోయినా వారసత్వంగా సంక్రమించిన జబ్బుకి 12 ఏళ్లకే చూపుని కోల్పోయింది హిమాన్షి. అయినా తను ఎక్కడా నిరాశపడలేదు. అంచెలంచెలుగా ఎదిగింది. చదువులో రాణించింది. చదరంగంలో మేటి క్రీడాకారిణిగా నిలిచింది. దేశం గర్వించేంత స్థాయికి ఎగబాకింది. 2023లో జరిగిన ఏషియన్ పారా క్రీడల్లో పతకాలు గెలిచి, ఆ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా తన పేరుని చరిత్రలో లిఖించుకుంది.



గుజరాత్ పలన్‌పూర్ నుండి హిమాన్షి చేసిన ప్రయాణాన్ని తెలుసుకుంటే అది ఎంతో స్ఫూర్తివంతంగా ఉంటుంది. ఆరోగ్యంగా పుట్టిన హిమాన్షికి మూడేళ్లు వచ్చేసరికి చూపులో లోపం కనిపించింది. డాక్టర్లు ఆ జబ్బుని 'రెటినిటిస్ పిగ్మంటోసా' అని నిర్ధారణ చేశారు. వారసత్వంగా ఇది సంక్రమిస్తుందని, చికిత్స లేదని తేల్చిచెప్పారు. హిమాన్షి వాళ్ల నానమ్మకి, అత్తయ్యకి ఈ వ్యాధి ఉంది. ఇది వచ్చిన వాళ్లకి నెమ్మదిగా చూపు మందగిస్తుంది. కొంత కాలానికి పూర్తిగా అంధత్వం సంక్రమిస్తుంది. ఈ వ్యాధితో బాధపడుతున్న హిమాన్షి ఈ విషయాన్ని త్వరగానే గ్రహించింది. భవిష్యత్తులో తను ఈ ప్రపంచాన్ని చూడలేనన్న విషయం తను 4వ తరగతికి వచ్చేసరికి అర్థమైంది. అప్పటివరకు సాధారణ పాఠశాలలో చదివిన హిమాన్షి, ఆ తరువాత అంధుల పాఠశాలకి బదిలీ అయ్యింది.



12 ఏళ్లకే పూర్తి అంధత్వం..

చదరంగం వైపు ఎలా దృష్టి మళ్లించిందో హిమాన్షి ఇలా చెబుతోంది. 'అంధుల పాఠశాలకి వెళ్లిన నేను, చదువులో ఏకాగ్రత కోసం టీచర్లు ఇచ్చిన సలహా మేరకు చెస్ ఆటపై ఆసక్తి పెంచుకున్నాను. ఆ వయసులో అది జస్ట్ నాకు హాబీలా ఉంది. కానీ అదే నా ప్రయాణాన్ని ఇంతలా మారుస్తుందని ఎప్పుడూ ఊహించలేదు' అని చెబుతున్న హిమాన్షి, 12 ఏళ్లు వచ్చేసరికి పూర్తిగా చూపుని కోల్పోయింది. అయినా చెస్‌లో మెళకువలు సాధించేందుకు తన తండ్రి భవేష్ రాథి, బ్లైండ్ పీపుల్స్ అసోసియేషన్(బిపిఎ)ని పరిచయం చేశారు. ఆ సంస్థ హిమాన్షి ఉన్నతికి ఎంతో సహకరించింది. వైకల్య బాధితుల కోసం పనిచేస్తున్న సంస్థల్లో దేశంలోనే అతిపెద్ద సంస్థ ఇది. సంస్థ ఇచ్చిన ప్రోత్సాహంతో హిమాన్షిని కోచ్ దర్శన్ పాండ్యా తీర్చిదిద్దారు. ఇంకా చెస్ కోఆర్డినేటర్లు హేమా థంకీ, పరితోష్ దేవ్‌ల గురించి కూడా హిమాన్షి తరచూ చెబుతుంది.

జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో..

చదరంగంలో నైపుణ్యం సాధించిన హిమాన్షి, బిపిఎ చొరవతో పలు టోర్నమెంట్లలో ఆడడం ప్రారంభించింది. 2019, 2020 నాటికి నేషనల్ ఛాంపియన్ స్థాయికి ఎదిగింది. 2022లో ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్‌లో ఉమెన్స్ ఛాంపియన్‌షిప్‌లో ఆడి విజేతగా నిలిచింది. 2023లో చైనా హంగ్జౌవులో నిర్వహించిన ఏషియన్ పారా గేమ్స్‌లో వ్యక్తిగత హోదాలో, బృందంతో కలిపి రెండు కాంస్య పతకాలు సాధించింది. హిమాన్షి సాధించిన ఈ విజయం పతకాల కంటే అపూర్వమైనది.

ఉద్యోగం చేస్తూనే..

తొలి అంతర్జాతీయ క్రీడల్లో సత్తా చాటి వచ్చిన హిమాన్షికి ఆ రాష్ట్ర ప్రభుత్వం తాలుకా డెవలప్‌మెంట్ ఆఫీసర్, క్లాస్ 2 హోదాలో ఉద్యోగం ఇచ్చి తగినరీతిలో సత్కరించింది. ఉద్యోగంలో పూర్తికాల బాధ్యతల్లో ఉంటూనే ఉన్నత చదువులు చదివింది. చదరంగం పోటీల్లో పాల్గొంది. ఇంకా గుర్రపుస్వారీలో శిక్షణ తీసుకుంది. ఈతలో ప్రావీణ్యం పొందింది. ఇంగ్లీష్ లిటరేచర్‌లో బిఎ, ఎంబిఎలో బంగారు పతకాలు సొంతం చేసుకుంది. యుపిఎస్‌సిలో ర్యాంకు సాధించడం లక్ష్యంగా పెట్టుకుంది. 2022లో చేసిన తొలి ప్రయత్నంలో విజయం సాధించలేదు. అయినా నిరుత్సాహపడకుండా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఈ ఏడాది నవంబరులో హిమాన్షి బిపిఎ ఆధ్వర్యంలో జాతీయ టోర్నమెంట్‌కి సిద్ధమవుతోంది. ఈ పోటీల్లో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులతో తలపడనుంది. సాధారణ వ్యక్తులకు కూడా సాధ్యం కాని ఇన్ని పనులను, వైకల్యంతో బాధపడుతూ కూడా హిమాన్షి సాధిస్తోంది. ఈ స్ఫూర్తివంత ప్రయాణం గురించి ఆమె ఇలా చెబుతోంది.

"నేర్చుకోవడాన్ని ఎప్పటికీ ఆపకూడదు' అని నా మనసు చెబుతుంది. అందుకే ఇవన్నీ సాధ్యమయ్యాయి. గుర్రపు స్వారీ అమ్మ దీపాలి నుండి నేర్చుకున్నాను. మొదట తను ఈ ఘనత సాధించింది. ఆ తరువాత నాకు నేర్పింది. అలాగే ఈత కూడా. 5,6 తరగతులు చదువుతున్నప్పుడే సాధన చేశాను. మా అక్క ఉర్వి దృష్టిలోపంతో బాధపడుతూనే ఈతలో నైపుణ్యం సాధించింది. పోటీల్లో పాల్గొంటోంది. అమ్మ, అక్క, అన్నయ్య, నాన్న ఇలా నా వెనుక ఓ మంచి కుటుంబం ఉంది. నా లోపాలను వాళ్లు చూడలేదు. నా బలహీనతలపై వారి దృష్టి లేదు. ఎప్పుడూ నాలో ఆత్మస్థైర్యం నింపేందుకు వాళ్లు కృషి చేస్తారు' అని కుటుంబం గురించి హిమాన్షి ఎంతో గర్వంగా చెప్పింది.

సీతాఫలం

ఆకుల్లోనూ పోషకాలు

ఈ సీజన్‌లో లభించే ఫలాల్లో సీతాఫలం అత్యంత మధురమైనది. ఫలమే కాదు; ఆకుల్లోనూ ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. సీతాఫలం ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్స్ సమృద్ధిగా లభిస్తాయి. ఆకులను శుభ్రంగా కడిగి ఒక గ్లాసు నీటిలో వేసి బాగా మరిగించాలి. తరువాత ఈ నీటిని వడపోసుకుని గోరువెచ్చగా ఉన్నప్పుడు తాగాలి. సీతాఫలం ఆకుల కషాయాన్ని తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వైరస్, బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించకుండా అడ్డుకుంటాయి.. పరగడుపున



ఈ ఆకుల కషాయాన్ని తాగితే రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ ఆకుల కషాయాన్ని తాగితే వృద్ధాప్య ఛాయలను తొలగించి చర్మం కాంతివంతంగా మెరిసేలా చేస్తుంది. గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. గుండె పోటు రాకుండా చేస్తుంది. పుండ్లు, గాయాలు ఉన్నచోట ఈ ఆకులను ముద్దగా నూరి ఆ మిశ్రమాన్ని వాటిపై ఉంచాలి. ఇలా చేస్తూ ఉంటే త్వరగా మానిపోతాయి. గజ్జి, తామర, దురద ఉన్నచోట కూడా ఈ ఆకుల మిశ్రమాన్ని రాస్తే చర్మ సంబంధిత సమస్యలను తొలగిస్తుంది. ఈ ఆకుల పొడిని కలిపి రాసుకుంటే ముఖం కాంతివంతంగా మారుతుంది.

మోహన్‌లాల్‌కు సిఓఎఎస్ కమెండేషన్ అవార్డు



మలయాళ నటుడు మోహల్‌లాల్‌కి మరో అరుదైన గౌరవం దక్కింది. భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది చేతుల మీదుగా ఆయన 'సీవోఏఎస్ కమెండేషన్' పురస్కారాన్ని అందుకున్నారు. 2009 నుంచి టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్‌గా ఉన్న మోహన్‌లాల్ ఈ గుర్తింపు పొందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. సోషల్‌మీడియాలో కృతజ్ఞతలు తెలుపుతూ 'భారత సైన్యానికి సేవ చేయడం గర్వంగా ఉంది' అన్నారు. ఇటీవలే దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుతో సత్కరించబడిన ఆయన, ప్రస్తుతం పలు మలయాళ, తెలుగు చిత్రాల్లో నటిస్తున్నారు. న్యూఢిల్లీలోని ఆర్మీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో మోహన్‌లాల్ లెఫ్టినెంట్ కర్నల్ హోదాలో పాల్గొన్నారు. సైన్యంలో విశిష్ట సేవలందించిన వారికి ఈ అవార్డును ఇస్తుంటారు. మోహన్‌లాల్ 2009లో భారత టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్‌గా నియమితులయ్యారు. అప్పటి నుంచి ఆయన సైనిక కార్యకలాపాల్లో భాగస్వామ్యం అవుతూ, దేశానికి తనవంతు సేవలు అందిస్తున్నారు.

'తెలుసు కదా' మంచి ప్రేమకథా చిత్రం : నీరజ కోన



'స్కూల్ డేస్ నుంచే నాకు రైటింగ్ అంటే ఇష్టం. కథలు చెప్పడం ఇంకా ఇష్టం. అలా కొన్ని కథలు రాసుకున్నాను. నా స్నేహితులు రానా, నాని వంటివారు బాగా సపోర్ట్ చేశారు. ఒక దశలో సినిమా కథ రాయగలననే నమ్మకం కలిగింది. అలా రాసుకున్న కథే ఈ 'తెలుసు కదా'. ఇది మంచి ప్రేమ కథా చిత్రం. ప్రేమకథతోపాటు ఒక కాంప్లెక్స్ సిటీ కూడా ఉంది. నేను మహిళా దర్శకురాలిని కనుక ఈ సినిమా కథను మహిళా దృష్టి కోణంలో చెప్పలేదు. నిజాయితీగా చెప్పే ప్రయత్నం చేశాం. ఫస్ట్ సిట్టింగ్‌లోనే నా కథను సిద్ధు జొన్నలగడ్డ ఓకే చేయడం, దర్శకురాలిగా నాకు అవకాశం రావడం నా జీవితంలో మంచి అనుభూతి. సిద్ధు మంచి పెర్ఫార్మెన్స్ ఇందులో ఇచ్చారు. కథలో కాంప్లెక్స్‌గా ఉండే రాగపాత్ర కోసం శ్రీనిధిని తీసుకున్నాం. అంజలిపాత్రకి రాశి సరిపోయారు. తమన్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. కాస్ట్యూమ్ డిజైనర్‌గా 12 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. నా కెరీర్ స్టార్టింగ్‌లోనే ఎన్టీఆర్, రామ్‌చరణ్, రవితేజ, విజయ్, సూర్య వంటి పెద్ద కథానాయకుల సినిమాలకు పనిచేశా. దర్శకురాలిగా నా తర్వాతి చిత్రం కూడా లవ్‌స్టోరీనే. త్వరలోనే వివరాలు వెల్లడిస్తా' అని అన్నారు నీరజ కోన. సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటించిన చిత్రం 'తెలుసు కదా'. శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా కథానాయికలు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానుంది.



'మాస్ జాతర' నుండి 'హుడియో హుడియో'

రవితేజ నటించిన 'మాస్ జాతర' చిత్రం నుంచి తాజాగా మూడవ గీతంగా 'హుడియో హుడియో' పాటని విడుదలచేశారు. దేవ్ రచించిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపర్చి తనే స్వయంగా పాడారు. అతనితో మరో సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ గొంతు కలిపారు. శ్రీలీల ఈ చిత్రంలో హీరోయిన్‌గా చేస్తున్నారు. భాను భోగవరపు దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా ఈ నెల 31న విడుదల కాబోతోంది.

ఎట్టకేలకి 'సంతోష్' థియేటర్లలో కాదు; ఓటీటీలో..

అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకుని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ అభ్యంతరాల కారణంగా ఇండియాలోని థియేటర్‌లలో విడుదల కాలేకపోయిన హిందీ చిత్రం 'సంతోష్' ఎట్టకేలకు ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక లయన్స్ గేట్స్ ప్లేలో ఈ చిత్రం అక్టోబర్ 17 నుంచి స్ట్రీమింగ్ కాబోతోంది. ఈ చిత్రంలో కుల హింస, లింగ వివక్ష, గ్రామీణ ప్రాంతాల్లోని అవినీతి, పోలీసుల క్రూరత్వం వంటి సున్నితమైన అంశాలను వాస్తవికంగా చూపించారని సెన్సార్ బోర్డు అభ్యంతరం తెలిపింది. దీంతో సిబిఎఫ్‌సి అధికారులు సినిమాలో ఎక్కువ కట్స్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కొన్ని పాత్రల పేర్లు మార్చాలని కూడా సూచించారు. అయితే వీటికి మేకర్స్ అంగీకరించలేదు. దీంతో సెన్సార్ సర్టిఫికేట్ జారీ చేయడానికి బోర్డు నిరాకరించింది. దీంతో ఈ చిత్రాన్ని బ్రిటిష్ ప్రభుత్వం విడుదల చేయగా.. పలు ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో పోటీ చేసి అవార్డులను గెలుచుకుంది. ఈ చిత్రానికి సంధ్యా సూరి దర్శకత్వం వహించగా.. నటి షహానా గోస్వామి ప్రధాన పాత్రలో నటించారు. సినిమా కథ ఏంటంటే.. ఉత్తర భారతదేశంలోని కుల



ఆధిపత్యం, లింగ వివక్ష ఉన్న ప్రాంతంలో ఈ కథ నడుస్తుంది. తన భర్త చనిపోయిన తర్వాత, అతని ఉద్యోగాన్ని స్వీకరించి పోలీసు కానిస్టేబుల్‌గా మారిన సంతోష్ సైనీ (షహానా గోస్వామి) అనే యువ వితంతువు చుట్టూ ఈ కథ తిరుగుతుంది. కానిస్టేబుల్‌గా చేరిన సంతోష్‌కి ఒక క్రూరమైన నేరాన్ని పరిశోధించే పని అప్పగిస్తారు పోలీసులు. అయితే ఈ దర్యాప్తులో సంతోష్‌కి తెలిసిన నిజాలు ఏంటి. సంతోష్‌కి సమాజంలో ఎదురైన సమస్యలు ఏంటి అనేది ఈ సినిమా కథ.

విశాఖలోనూ అదే జోష్..

- నేడు దక్షిణాఫ్రికాతో తలపడనున్న హర్మన్‌ప్రీత్ సేన
- పొంచివున్న వర్షం ముప్పు
- ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్



విశాఖపట్నం: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా మరో పోరుకు సిద్ధమైంది. వరుసగా రెండు విజయాలతో 2వ స్థానంలో ఉన్న హర్మన్‌ప్రీత్ సేన.. విశాఖలోనూ అదే ఉత్సాహాన్ని కనబర్చి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంపై గురిపెట్టింది. దీంతో గురువారం జరిగే మూడో లీగ్ మ్యాచ్‌లో పటిష్ట దక్షిణాఫ్రికాతో పోరుకు టీమిండియా సిద్ధమైంది. శ్రీలంక, పాకిస్తాన్‌పై సునాయాస విజయాలను నమోదు చేసుకున్న భారత మహిళలజట్టుకు అసలు సిసలు పరీక్ష నేడు ఎదురుకానుంది. మరోవైపు దక్షిణాఫ్రికా జట్టు తొలి మ్యాచ్‌లో ఆసీస్ చేతిలో చిత్తుగా ఓడినా.. రెండో మ్యాచ్‌లో ఏకంగా న్యూజిలాండ్ మహిళలకు ఝలక్ ఇచ్చిన ఉత్సాహంతో భారత్‌తో మ్యాచ్‌కు సిద్ధమైంది. మహిళా క్రికెటర్లనూ ప్రోత్సహించాలనే దృష్టితో బిసిసిఐ ఎంట్రీ టికెట్ ఫ్రీగా ప్రకటించింది. దీంతో విశాఖలోని ఎసిఎ-విడిసిఎ స్టేడియంలో తొలిసారి జరిగే ఈ మ్యాచ్‌కు భారీ సంఖ్యలో ప్రేక్షకులు హాజరు కానున్నట్లు సమాచారం. టీమిండియా ఓపెనర్లు దుర్భేధ్యఫామ్‌కి తోడు బౌలింగ్ విభాగంలో క్రాంతి గాడ్, శ్రీచరణి, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఫామ్‌లో ఉండడం శుభపరిణామం. బ్యాటింగ్‌లో స్మృతి మంధాన రాణిస్తే భారీస్కోర్ నమోదు కావడం ఖాయం. వికెట్ కీపర్ రీచా ఘోష్ క్యాచ్‌లు అందుకోవడంలో కొంత అలసత్వం ప్రదర్శిస్తున్నా.. బ్యాటింగ్‌లో రాణిస్తుండడం శుభ పరిణామం. పాకిస్తాన్‌పై 20బంతుల్లో 35పరుగులు కొట్టి భారతజట్టు గౌరవప్రద స్కోర్‌కు దోహదపడింది. ఈ టోర్నీ ప్రారంభానికి ముందు భారత మహిళలజట్టు ఇక్కడే ప్రాక్టీస్ అయిన దృష్ట్యా పిచ్ స్వభావంపై ఆటగాళ్లకు ఒక అవగాహన ఉండగా.. ఈ మ్యాచ్ తర్వాత భారత మహిళలజట్టు పటిష్ట ఆస్ట్రేలియాతో తలపడాల్సి ఉన్న క్రమంలో గెలుపే లక్ష్యంగా సఫారీలతో మ్యాచ్‌కు సిద్ధమైంది. జ్వరం కారణంగా పాకిస్తాన్‌తో మ్యాచ్‌కు దూరమైన రేణుకా సింగ్, అమన్‌జ్యోత్ కౌర్ కోలుకోవడం భారతజట్టుకు ఊరటనిచ్చే అంశం. 50 ఓవర్ల మ్యాచ్ పూర్తిగా సాగితే ఈ మైదానంలో పరుగుల వరద పారడం ఖాయమని క్యూరేటర్ ఇప్పటికే ప్రకటించగా.. వర్షం ముప్పు పొంచివున్నట్లు ఇక్కడి వాతావరణ శాఖ బుధవారం ప్రకటించింది.

పొంచివున్న వర్షం ముప్పు?

భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య గురువారం జరిగే మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి వున్నట్లు ఇక్కడి వాతావరణ శాఖ బుధవారం ప్రకటించింది. మ్యాచ్ జరిగే రోజు ఉదయం తేలికపాటి వర్షం కురిసే అవకాశమున్నట్లు.. బుధవారం కూడా వర్షం కురిసిన నేపథ్యంలో నేడు జరిగే మ్యాచ్‌కూ వర్షం అడ్డంకి నిలవడం ఖాయమని తాజా ప్రకటనలో పేర్కొంది. మ్యాచ్ జరిగే సమయంలో మేఘాలు 78% మైదానాన్ని కమ్మివేయనున్నట్లు దీంతో మ్యాచ్ సజావుగా సాగడం కష్టమేనని వాతావరణ శాఖ పేర్కొంది. దీంతో టాస్ గెలిచిన జట్టు తొలుత బ్యాటింగ్‌కు మొగ్గుచూపే అవకాశముంది.

జట్లు(అంచనా)...

భారత మహిళలజట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), ప్రతిక రావల్, మంధాన(వైస్ కెప్టెన్), హర్లీన్ డియోల్, రోడ్రిగ్స్, దీప్తి శర్మ, స్నేహ్ రాణా, రీచా ఘోష్(వికెట్ కీపర్), శ్రీచరణి, క్రాంతి గాడ్, రేణుకా సింగ్/అమన్‌జ్యోత్.

దక్షిణాఫ్రికా మహిళలజట్టు: వోల్వాడాట్(కెప్టెన్), తజ్మిన్ బ్రిట్స్, సూనే లూస్, మారిజానే కాప్, బోట్చ్, జోఫ్రా(వికెట్ కీపర్), ట్రయాన్, డి-క్లార్క్, క్లాస్, ఖాకా, మాబా.

సెంచరీతో ఆదుకున్న మూనీ

- పాకిస్తాన్‌పై ఆస్ట్రేలియా మహిళల ఘన విజయం



కొలంబో: పాకిస్తాన్ మహిళలతో జరిగే లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా మహిళలు ఘన విజయం సాధించారు. పాకిస్తాన్‌పై ఆసీస్ జట్టు ఏకంగా 107పరుగుల తేడాతో చిత్తుచేసి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 115పరుగులకే 8వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో బెత్ మూనీ(109) అద్భుత శతకంతో చెలరేగింది. ఓవైపు వికెట్లు పడుతున్నా.. మొక్కవోని దీక్షతో సెంచరీ మార్కును దాటి.. జట్టుకు మెరుగైన స్కోరు అందించింది. మరోవైపు కింగ్(51నాటౌట్) అర్ధసెంచరీతో రాణించింది. దీంతో వీరిద్దరూ 9వ వికెట్‌కు ఏకంగా 106పరుగులు జోడించారు. ఆర్.ప్రేమదాస స్టేడియంలో టాస్ గెలిచిన పాకిస్తాన్ మహిళా జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. కెప్టెన్ ఫాతిమా సనాతో పాటు సైదా ఇక్బాల్ ఆది నుంచే చెలరేగి ఆసీస్ ఓపెనింగ్ జంటను విడదీశారు. ఈ క్రమంలో ఓపెనర్లలో ఫొబె లిచ్‌ఫీల్డ్ 10, కెప్టెన్ అలిసా హేలీ 20 పరుగులకే పరిమితం కాగా.. వన్‌డౌన్లో వచ్చిన ఎలిస్ పెర్రీ (5) దారుణంగా విఫలమైంది. నస్రా సంధు బౌలింగ్‌లో స్టంపౌట్‌గా వెనుదిరిగింది. పాక్ బౌలర్లు నస్రా సద్దుకు మూడు, రమీమ్, ఫాతిమాకు రెండేసి, దియా, సదియాకు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో పాకిస్తాన్ జట్టు 36.3ఓవర్లలో 114పరుగులకే ఆలౌటైంది. శిద్రా అమీన్(35), షమీమ్(15) టాప్ స్కోరర్స్. ఆసీస్ బౌలర్లు కిమ్ గ్రాత్‌కు మూడు, స్కట్స్, సథర్లాండ్స్‌కు రెండేసి, కింగ్, గార్డినర్, వారేహామ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మూనీకి దక్కింది.

సత్తా చాటిన తెలుగు టైటాన్స్



చెన్నై: ప్రొ కబడ్డీ సీజన్-12లో తెలుగు టైటాన్స్ జట్టు హవా కొనసాగుతోంది. ఎడిఎటి మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 46-29 పాయింట్ల తేడాతో హర్యానా స్టీలర్స్‌ను చిత్తుచేసింది. ఆల్‌రౌండర్ భరత్ ఏకంగా 20 పాయింట్లతో సత్తా చాటగా.. కెప్టెన్ విజయ్ మాలిక్(9) రైడ్ పాయింట్లతో రాణించాడు. ట్యాకిల్స్‌లో శుభమ్, అంకిత్ చెలరేగారు. మరోవైపు హర్యానా జట్టులో రైడర్ మయాంక్ సైనీ(5)కి తోడు కెప్టెన్ జైదీప్(4) మాత్రమే రాణించారు. ఈ గెలుపుతో తెలుగు టైటాన్స్ 13మ్యాచ్‌లు ముగిసేసరికి 8విజయాలతో సహా 16పాయింట్లతో 3వ స్థానానికి ఎగబాకింది. మరో మ్యాచ్‌లో పుణేరి జట్టు 37-27పాయింట్ల తేడాతో యు ముంబను ఓడించింది.

ప్రొ కబడ్డీలో నేడు..

బెంగాల్ వారియర్స్ × దబాంగ్ ఢిల్లీ(రాత్రి 8.00గం॥లకు)
గుజరాత్ జెయింట్స్ × యుపి యోధాస్(రాత్రి 9.00గం॥లకు)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68